




# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 33 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 20-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

ఊరించిన వర్షానికి సంబరపడ్డ రైతు,
ఇప్పుడు భానుడి ప్రతాపానికి
లబో దిభో మవుతున్నాడు.
పచ్చని మొక్కలు ఆకాశం వైపు ఆశగా
చూస్తున్నాయి, చినుకు కోసం నేలతల్లి
కన్నీటితో ఎదురుచూస్తోంది.
విత్తనం వేసిన చేతుల్లో నమ్మకం ఉంది,
పంట పండే దాకా గుండెల్లో గుబులు ఉంది.
చెమటను చిందించి అన్నం పండించే వాడు,
తన పళ్లెంలో అన్నం కోసం పోరాడుతున్నాడు.
డిజిటల్ యుగంలో
ప్రపంచం అరచేతిలోకి వచ్చినా,
రైతు గోస మాత్రం
అధికారుల చెవులకు చేరడం లేదు.
బిగ్‌బాస్ వేదికపై కన్నీరు పెడితేనే,
రైతు కష్టం వార్త అవుతుందా?
రైతు అంటే సింపుల్ మనిషి కాదు
——దేశపు ఆకలికి అన్నదాత,
నాగలి పట్టిన సైనికుడు.
అతని చెమట చుక్కే
మన బతుకుకు బంగారు ధాన్యం,
అతని కన్నీటి చుక్క మాత్రం దేశానికే మచ్చ.
రైతు బతికితేనే దేశం బతుకుతుంది
——రైతు నవ్వే రోజు నిజమైన రైతు రాజ్యం.....

– నరసింహ జర్నలిస్ట్....,
కోట్ పల్లి వికారాబాద్ ....



## తెలంగాణ బీజేపీలో మార్పులకు సంకేతాలు..

# జాతీయ కమిటీలో రాష్ట్ర నేతలకు నో ఛాన్స్

- గ్రూపు రాజకీయాలు, ఢిల్లీకి ఫిర్యాదులపై రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు.
- తెలంగాణ బీజేపీ నేతలు ఇప్పటికైనా మారాలని హితవు
- రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా హైకమాండ్ కొత్త వ్యూహం..?
- బండి సంజయ్‌కు రాష్ట్ర బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందనే చర్చ





**ప్రజా వాయిస్, ప్రత్యేకం :** తెలంగాణ కేంద్రంగా బీజేపీ నాయకత్వం వ్యూహం మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. పార్టీని రాష్ట్రంలో మరింత బలోపేతం చేయడంతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త నిర్ణయాలు తీసుకుంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా ప్రకటించిన బీజేపీ జాతీయ కమిటీలో తెలంగాణకు చెందిన నేతలకు ఎలాంటి ప్రాతినిధ్యం కల్పించకపోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో జాతీయ స్థాయిలో కొనసాగిన తెలంగాణ నేతలను కూడా తాజా కమిటీలో కొనసాగించలేదు.

### తెలంగాణపై బీజేపీ కొత్త వ్యూహం..

దక్షిణాదిలో తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టి సారించిన బీజేపీ అధిష్ఠానం.. రాష్ట్ర పార్టీకి కొత్త దిశానిర్దేశం చేస్తున్నట్లు తెలుస్తోంది. వరుసగా కేంద్ర మంత్రులు తెలంగాణలో పర్యటించడం, వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇదే సమయంలో రాష్ట్ర నేతలను పూర్తిగా తెలంగాణలో పార్టీ బలోపేతం, వచ్చే ఎన్నికలపై దృష్టి పెట్టేలా చేయడానికే జాతీయ కమిటీలో అవకాశం ఇవ్వలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### గ్రూపు రాజకీయాలపై రాజాసింగ్ ఫైర్..

జాతీయ కమిటీలో తెలంగాణ నేతలకు ప్రాతినిధ్యం దక్కకపోవడంపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బీజేపీలో ప్రతిసారి గ్రూపు

మిగతా 2లో




## "బాబు" అనే ఒక్క మాటతో వీడిన హత్య మిస్టరీ..!

- పాఠాలు చెప్పిన టీచర్‌నే హత మార్చిన పదో తరగతి విద్యార్థులు
- కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసును ఛేదన
- కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ. శరత్ చంద్రపవార్

**ప్రజా వాయిస్,నల్లగొండ.** కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి దారుణ హత్య కేసును నల్లగొండ జిల్లా పోలీసులు ఛేదించారు. దోపిడీ కోసం పక్కా ప్రణాళికతో హత్యకు పాల్పడిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శాస్త్రీయ దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆధారాలు, సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక విశ్లేషణతో పాటు చివరగా రూపారెడ్డి ఫోన్‌లో మాట్లాడిన సమయంలో పలికిన "బాబు" అనే ఒక్క మాట ఈ కేసును కీలక మలుపు తిప్పిందని నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదు, మృతురాలి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తి, గ్లౌజులు, మాస్కులు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మిగతా 2లో

## కర్రెగుట్టల్లో ఖాకీ సాహసం.. ఇంటికి వస్తే కన్నీటి వ్యధ..!

- 27 నెలలుగా ప్రయాణ భత్యాలు పెండింగ్
- ఆరు విడతల డీఏ బకాయిలతో పోలీసు కుటుంబాలపై ఆర్థిక భారం
- అడవుల్లో ప్రాణాలకు తెగించి విధులు.. పిల్లల ఫీజులకు మాత్రం ఎదురుచూపులు
- కర్రెగుట్టలపై జెండా ఎగరేసిన ఖాకీకి ప్రభుత్వం భరోసా ఎప్పుడు.?

2 లో



## పరకాల కాంగ్రెస్‌లో ముదిరిన టికెట్ రగడ..

# సీఎం రేవంత్‌పై సుస్మిత ఘాటు వ్యాఖ్యలు

- రేవూరిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం పిలుపుపై సుస్మిత ఫైర్
- ఎన్నికలకు రెండేళ్లు ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్న
- కొండా మురళికి ఎమ్మెల్సీ హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదని ఆరోపణ
- సీఎం అయ్యాక రేవంత్‌కు కళ్లు నెత్తికెక్కాయా అంటూ ఘాటు వ్యాఖ్యలు
- పరకాల నుంచి పోటీకి సిద్ధమనే సంకేతాలు ఇస్తున్న సుస్మిత



కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**ప్రజా వాయిస్, వరంగల్:** తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలు రోజు రోజుకూ వేడెక్కుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునివ్వడం ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యాఖ్యలపై మంత్రి

### రేవూరిని మళ్లీ ఎలా ప్రకటిస్తారు..?

ఎన్నికలకు ఇంకా రెండేళ్లు ఉండగానే పరకాల నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మరోసారి పోటీ చేయిస్తామని సీఎం ఎలా ప్రకటిస్తారని సుస్మిత ప్రశ్నించారు. పరకాల నియోజకవర్గంతో రేవూరికి సంబంధమేంటని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో రేవూరిని గెలిపిస్తానంటూ సీఎం ప్రచారం చేయాలని.. అప్పుడు ఎవరు గెలుస్తారో తేలుతుందని సవాల్ విసిరారు.పరకాలలో కొండా కుటుంబం లేకపోతే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలిచేవారు కాదని సుస్మిత వ్యాఖ్యానించారు. నాలుగైదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసిన తమ కుటుంబాన్ని ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు.

మిగతా 2లో

## ఇందిరమ్మ ఇచ్చింది..

# రేవంత్ సర్కార్ లాక్కుంది

- ఒక్కరోజులో మారిన సీన్
- రైతుల భూములకు కంచె ..26 కుటుంబాల కన్నీటి గాథ
- లావణి పట్టాలు.. పాస్‌బుక్కులు ఉన్నా పట్టించుకోలేదా
- నోటీసులు లేకుండానే పోలీసుల బందోబస్తు
- కంచె వేసి భూమి స్వాధీనం
- పంటలు చేతికొచ్చే వేళ అధికారుల హడావుడి
- పరిహారం, ప్రత్యామ్నాయ భూమి ఏది
- తరతరాలుగా సాగు చేసు కుంటున్న భూమి లాక్కుంటే మా బతుకులు ఏంటి
- అంటూ బాధితుల ఆవేదన.
- బాధిత కుటుంబాలకు అండగా ప్రజా వాయిస్.

2 లో

## తెలంగాణ పోలీస్ శాఖలో భారీ పునర్వ్యవస్థీకరణ

# 513 మంది సిబ్బంది బదిలీ

- గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ సిబ్బందికి కొత్త బాధ్యతలు
- 5 మంది సీఐలు, 22 మంది ఎస్ఐలకు బదిలీ
- 14 మంది ఏఎస్ఐలు, 84 మంది హెడ్ కానిస్టేబుళ్లకు కొత్త పోస్టింగ్స్
- 388 మంది కానిస్టేబుళ్లకు ఇతర విభాగాల్లో బాధ్యతలు
- ట్రాఫిక్, రోడ్డు భద్రత విభాగానికి అత్యధికంగా 224 మంది కేటాయింపు
- రెండు నెలల అటాచ్‌మెంట్ తర్వాత తుది బాధ్యతల ఖరారు



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** మారుతున్న సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ విభాగాల్లో పనిచేస్తున్న 513 మంది సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. సిబ్బంది అనుభవం, విద్యార్హతలు, సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

### 513 మంది సిబ్బందికి బదిలీ..

పునర్వ్యవస్థీకరణలో భాగంగా 5 మంది సీఐలు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలను ఇతర విభాగాలకు బదిలీ చేశారు. వీరితో పాటు 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లకు కొత్త బాధ్యతలు అప్పగించారు. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేసినట్లు డీజీపీ తెలిపారు.

### ట్రాఫిక్, రోడ్డు భద్రతకు 224 మంది

బదిలీల్లో భాగంగా అత్యధికంగా 224 మంది సిబ్బందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, రోడ్డు భద్రతకు మరింత ప్రాధాన్యత ఇవ్వడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### రెండు నెలల అటాచ్‌మెంట్..

కొత్త బాధ్యతలు చేపట్టే ముందు బదిలీ అయిన సిబ్బందిని రెండు నెలల పాటు వివిధ విభాగాల్లో అటాచ్‌మెంట్ ద్వారా పనిచేయించనున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ కాలంలో సిబ్బంది పనితీరు, సామర్థ్యం, అనుభవాన్ని పరిశీలించనున్నారు.అనంతరం వారి విద్యార్హతలు, అనుభవం, సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని తుది బాధ్యతలను నిర్ణయించనున్నట్లు డీజీపీ స్పష్టం చేశారు. మారుతున్న నేరాలు, సాంకేతిక సవాళ్లు, ప్రజా భద్రత అవసరాలకు అనుగుణంగా పోలీస్ శాఖను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ఈ పునర్వ్యవస్థీకరణ లక్ష్యంగా కనిపిస్తోంది.

## పరకాల కాంగ్రెస్‌లో ముదిరిన టికెట్ రగడ..

# సుస్మితపై ఎమ్మెల్యే నాగరాజు ఫైర్

- సీఎం రేవంత్ రెడ్డిపై సుస్మిత వ్యాఖ్యలకు కేఆర్ నాగరాజు కౌంటర్
- కాంగ్రెస్‌లో కనీస సభ్యత్వం కూడా లేదంటూ ఘాటు విమర్శలు
- దమ్ముంటే సీఎంపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలని సవాల్
- వ్యక్తిగత విమర్శలకు స్పందించి తన స్థాయిని తగ్గించుకోనన్న రేవూరి
- ప్రజల్లో మంచి పేరు, ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగానే టికెట్ ప్రకటించారని వెల్లడి



**ప్రజా వాయిస్, వరంగల్:** వరంగల్ జిల్లా రాజకీయాల్లో పరకాల నియోజకవర్గ టికెట్ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరకాల సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ప్రజలను కోరడంపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రెండేళ్ల తర్వాత జరిగే ఎన్నికలకు ఇప్పుడే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. పరకాలలో పోటీ చేయబోయేది తానేనని, కొండా కుటుంబ సభ్యుల గెలుపును ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి వచ్చి ప్రచారం చేసినా రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలవరని అన్నారు.

### సుస్మిత వ్యాఖ్యలకు ఎమ్మెల్యే నాగరాజు కౌంటర్..

కొండా సుస్మిత వ్యాఖ్యలపై

మిగతా 2లో

# జాతీయ కమిటీలో రాష్ట్ర నేతలకు నో ఛాన్స్

మొదటి పేజీ తరువాయి




రాజకీయాలు, ఆధిపత్య పోరు కొనసాగుతున్నాయని అన్నారు. ఒకరిపై ఒకరు ఢిల్లీకి ఫిర్యాదులు చేయడం వల్లే పార్టీ జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నాయకులకు చోటు దక్కలేదని అభిప్రాయపడ్డారు.ఇప్పటికైనా తెలంగాణ బీజేపీ నేతలు తమ వైఖరిని మార్చుకోవాలని రాజాసింగ్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై దూకుడుగా పోరాటం చేయాల్సిన సమయంలో నేతల మధ్య అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. నేతలంతా కలిసి పనిచేసి పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**బీజేపీ హైకమాండ్ అసంతృప్తిగా ఉందా?**

తెలంగాణ బీజేపీ నేతల పనితీరు, పరస్పర విభేదాలపై అధిష్ఠానం అసంతృప్తిగా ఉందనే చర్చ కూడా పార్టీ వర్గాల్లో సాగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని బలమైన పోరాటం చేయాలని హైకమాండ్ భావిస్తుండగా.. నేతల మధ్య ఆధిపత్య పోరు, గ్రూపు రాజకీయాలు ఆ లక్ష్యానికి అడ్డంకిగా మారుతున్నట్లు పార్టీ నాయకత్వం గుర్తించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అందుకే జాతీయ స్థాయి పదవుల కంటే రాష్ట్రంలోనే కీలక నేతలను పూర్తిస్థాయిలో పని చేయించేలా బీజేపీ వ్యూహం రూపొందించిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**బండి సంజయ్‌కు రాష్ట్ర బాధ్యతలు?**

మరోవైపు బండి సంజయ్‌ను జాతీయ రాజకీయాల నుంచి తప్పించడం వెనుక కూడా కీలక వ్యూహం ఉందనే చర్చ తెలంగాణ బీజేపీలో జరుగుతోంది. బండి సంజయ్‌కు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించేందుకే జాతీయ రాజకీయాల నుంచి తప్పించి ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడం, కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయడం, నేతల మధ్య సమన్వయం పెంచడమే లక్ష్యంగా బీజేపీ అధిష్ఠానం కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోందనే చర్చ సాగుతోంది. తాజా పరిణామాలు తెలంగాణ బీజేపీలో రాబోయే రోజుల్లో మరిన్ని మార్పులకు సంకేతాలా అన్నది ఆసక్తికరంగా మారింది.

# "బాబు" అనే ఒక్క మాటతో వీడిన హత్య మిస్టరీ..!



మొదటి పేజీ తరువాయి

**"బాబు" అనే ఒక్క మాట.. దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించింది**

ఆగస్టు 11న కొండమల్లేపల్లి పరిధిలో ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, సవాలుగా తీసుకుని దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నేరస్థలంలో ఫోరెన్సిక్ ఆధారాలు, ఫింగర్‌ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరా ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారాలను పోలీసులు సేకరించారు. హత్య జరిగిన ప్రాంతం చుట్టుపక్కల సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో దాదాపు 70 సీసీ కెమెరాల ఫుటేజీలను రాత్రింబవళ్లు విశ్లేషించారు. సుమారు 40 మంది పోలీసు అధికారులు, సిబ్బంది 80 మందికి పైగా అనుమానితులను విచారించారు. ఇదే సమయంలో హత్యకు ముందు రూపారెడ్డి తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతుండగా చివరిగా "బాబు" అని పలికిన విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. పాఠశాలలో విద్యార్థులను ఆమె సాధారణంగా "బాబు" అని పిలిచేవారని గుర్తించిన పోలీసులు దర్యాప్తును విద్యార్థుల వైపు మళ్లించారు.

**జల్సాల కోసం డబ్బు.. సోషల్ మీడియాలో వెతుకులాట.. పక్కా ప్లాన్‌తో హత్య**

పాఠశాల పునఃప్రారంభమైన అనంతరం విద్యార్థులను పోలీసులు సున్నితంగా విచారించారు. రెండు రోజులుగా పాఠశాలకు హాజరుకాని కొంతమంది విద్యార్థులపై ప్రత్యేక నిఘా పెట్టారు. వారిలో జల్సాలకు అలవాటు పడిన ఐదుగురిపై పోలీసులు మరింత దృష్టి సారించారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారాలు అనుమానిత విద్యార్థుల కదలికలతో సరిపోలడంతో దర్యాప్తు మరింత వేగవంతమైంది. ఈ క్రమంలో 16 ఏళ్ల వయసున్న ఇద్దరు పదో తరగతి విద్యార్థులు పోలీసుల అదుపులోకి వచ్చారు. విచారణలో గతంలో హాస్టల్‌లో డబ్బులతో పట్టుబడిన సందర్భంలో ప్రిన్సిపల్ తమ తల్లిదండ్రుల సమక్షంలో మందలించడంతో ఆమెపై కక్ష పెంచుకున్నట్లు వెల్లడైంది. ప్రిన్సిపల్ వద్ద పెద్ద మొత్తంలో నగదు ఉంటుందని భావించిన ఇద్దరూ సోషల్ మీడియా, యూట్యూబ్‌లో డబ్బు సంపాదించే మార్గాలతో పాటు హత్య అనంతరం పోలీసులకు చిక్కకుండా ఎలా తప్పించుకోవాలనే విషయాలపై అన్వేషణ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

**ఇంట్లోకి చొరబడి కత్తితో దాడి.. రూ.2.50 లక్షల నగదు అపహరణ**

పోలీసుల వివరాల ప్రకారం.. హత్యకు వారం రోజుల ముందే ఇద్దరు విద్యార్థులు రూపారెడ్డిని హతమార్చేందుకు రెక్కీ నిర్వహించారు. ఆగస్టు 11న సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి బ్యాగులో నుంచి ఎరుపు రంగు హుడీ, ప్యాంట్ తీసుకున్నారు. అనంతరం కొండమల్లేపల్లిలో కత్తి, గ్లౌజులు కొనుగోలు చేశారు. రూపారెడ్డి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని ఒకరు బయట ఎవరైనా వస్తున్నారా అని గమనిస్తుండగా, మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించాడు. తెరిచి ఉన్న వంటగది మార్గంగా ఇంట్లోకి ప్రవేశించి రూపారెడ్డిపై కత్తితో దాడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం బెడ్‌రూమ్‌లో ఉన్న సుమారు రూ.2.50 లక్షల నగదును తీసుకుని వెనుక గోడ దూకి నిర్మానుష్య ప్రాంతం నుంచి పరారయ్యారు. కత్తి, గ్లౌజులు, మాస్క్, సెల్‌ఫోన్‌ను చెట్ల పొదల్లో పడేసి, కొంతదూరంలో దుస్తులు మార్చుకుని ఎరుపు రంగు హుడీని డ్రైనేజీలో పడేసినట్లు ఎస్పి తెలిపారు.

**లోదుస్తుల్లో దాచిన నగదు.. రక్తపు మరకలతో ఉన్న నోట్లు కీలక ఆధారం**

బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో పెండ్లిపాకల జంక్షన్ రోడ్డు నుంచి మల్లేపల్లి వైపు వస్తున్న ఇద్దరు విద్యార్థులను దొనియాల ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా వారి లోదుస్తుల్లో నగదు దాచుకున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి సుమారు రూ.1.54 లక్షల నగదు లభించింది. అందులో మూడు రూ.500 నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నగదు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించగా ప్రిన్సిపల్ రూపారెడ్డిని హత్య చేసి నగదును అపహరించినట్లు విద్యార్థులు వెల్లడించినట్లు తెలిపారు. నిందితుల నుంచి మృతురాలి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తి, గ్లౌజులు, మాస్కులు, రెండు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చట్టంతో సంఘర్షణ పడిన ఇద్దరు 16 ఏళ్ల పదో తరగతి విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలల చట్టాలకు అనుగుణంగా తదుపరి న్యాయపరమైన ప్రక్రియ కొనసాగనుంది.కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాస రావు, మల్లెపల్లి సీఐ ఎ. నవీన్ కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, మల్లెపల్లి ఎస్ఐ ఎ. రమేష్, చింతపల్లి ఎస్ఐ ఎం. రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ డి. నరసింహులు, గుర్రంపోడు ఎస్ఐ ఎన్. వెంకన్న, సీసీఎస్ ఎస్ఐ యు. సురేష్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించి రివార్డులు ప్రకటించారు. ప్రతి చిన్న ఆధారాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ, సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయంతో దర్యాప్తు చేస్తే నేరాన్ని ఎంత తెలివిగా చేసినా ఛేదించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

# కర్రెగుట్టల్లో ఖాకీ సాహసం..ఇంటికి వస్తే కన్నీటి వ్యథ..!

**ప్రజావాయిస్, ములుగు ప్రత్యేక కథనం:** కర్రెగుట్టలు.. ఒకప్పుడు మావోయిస్టుల కదలికలతో ఉలిక్కిపడిన ప్రాంతం. ఇప్పుడు అదే కొండలపై జాతీయ జెండా గర్వంగా రెపరెపలాడుతోంది. ఈ మార్పు వెనుక ములుగు జిల్లా పోలీసుల ధైర్యసాహసాలు, నిరంతర శ్రమ, త్యాగం ఉన్నాయి. అడవుల్లో అడుగడుగునా ప్రమాదం పొంచి ఉన్నా వెనుకడుగు వేయకుండా విధులు నిర్వహించిన ఖాకీ.. ఇప్పుడు మాత్రం తమ కుటుంబ అవసరాల కోసం ప్రభుత్వం వైపు ఆశగా చూస్తోంది.

**27 నెలలుగా బకాయిలే..**

ములుగు జిల్లా పోలీసులకు గత 27 నెలలుగా ప్రయాణ భత్యాలు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. విధి నిర్వహణలో భాగంగా మారుమూల ప్రాంతాలు, అడవుల్లో తిరిగే సిబ్బందికి రావాల్సిన భత్యాలు సకాలంలో అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. నెల జీతం ఇంటి ఖర్చులు, నిత్యావసరాలు, పిల్లల చదువులు, రుణ వాయిదాలకే సరిపోతున్న సమయంలో అదనంగా రావాల్సిన భత్యాలు నిలిచిపోవడం భారంగా మారిందని వాపోతున్నారు.

**మందుపాతరల మధ్య విధులు..**

మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను ఎదుర్కొంటూ.. దట్టమైన అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తూ.. ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు విధులు నిర్వహించారు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలిచిన ఖాకీ.. విధులు ముగించుకుని ఇంటికి వచ్చాక పిల్లల ఫీజులు, కుటుంబ ఖర్చుల కోసం లెక్కలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఆరు విడతల డీఏ కూడా..**

ప్రయాణ భత్యాలతోపాటు ఆరు విడతల కరువు భత్యాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని పోలీసు కుటుంబాలు చెబుతున్నాయి. దీంతో కానిస్టేబుల్ నుంచి పైస్థాయి అధికారి వరకు నెలకు సుమారు రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు ఆదాయపరమైన నష్టం ఎదురవుతోందని పేర్కొంటున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, పిల్లల చదువుల ఖర్చులు, రుణ వాయిదాల నేపథ్యంలో ఈ బకాయిలు మరింత ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**త్యాగానికి గుర్తింపు కావాలి**

ములుగు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు మావోయిస్టు ప్రభావాన్ని అరికట్టడంలో పోలీసులు కీలక పాత్ర పోషించారు. కర్రెగుట్టల్లో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించిన సిబ్బంది కుటుంబాల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.



## పరకాల కాంగ్రెస్‌లో ముదిరిన టికెట్ రగడ..
# సీఎం రేవంత్‌పై సుస్మిత ఘాటు వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

**కొండా మురళికి ఎమ్మెల్సీ హామీ ఏమైంది..?**

సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి సుస్మిత పలు ప్రశ్నలు సంధించారు. పీసీసీ అధ్యక్ష పదవిని కోరుకున్న సమయంలో కొండా సురేఖ, కొండా మురళి రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షుడైన తర్వాత రేవంత్‌రెడ్డి తమ ఇంటికి వచ్చి కొండా మురళిని ఎమ్మెల్సీ చేస్తానని హామీ ఇచ్చారని ఆరోపించారు.మైసమ్మ, ఎల్లమ్మపై ప్రమాణం చేసి ఈ హామీ ఇవ్వలేదా అని సుస్మిత ప్రశ్నించారు. ఓ బీసీ బిడ్డ, ప్రజల మనిషి అయిన కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

**ముఖ్యమంత్రి అయితే కళ్లు నెత్తికెక్కాయా?'**

సీఎం రేవంత్‌రెడ్డిపై సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కళ్లు నెత్తికెక్కాయా అని ప్రశ్నించారు. తనకు ఎవరిపైనా భయం లేదని, చావుకు కూడా భయపడనని అన్నారు. తన తండ్రి కొండా మురళి తనను అలా పెంచారని వ్యాఖ్యానించారు.అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మరో 'పొంగు' ఉందంటూ పరోక్షంగా జిల్లా రాజకీయాలపై వ్యాఖ్యలు చేశారు. ఆ పొంగు ఎక్కువ కాలం ఉండదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసలు ముఖ్యమంత్రి ఎవరో, ఆయన ముఖ్యమంత్రి ఎవరో అర్థం కావడం లేదంటూ విమర్శించారు.

**'అప్‌కమింగ్ ఎమ్మెల్యే పరకాల' అంటూ ఇన్‌స్టా పోస్టు..**

సుస్మిత తాజా వ్యాఖ్యలతో పరకాల కాంగ్రెస్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఇప్పటికే ఆమె పరకాల నుంచి పోటీ చేసేందుకు సిద్ధమనే సంకేతాలు ఇస్తూ సోషల్ మీడియాలో 'అప్‌కమింగ్ ఎమ్మెల్యే పరకాల' అంటూ పోస్టు పెట్టారు. దీంతో వచ్చే ఎన్నికల్లో పరకాల టికెట్ కోసం కొండా కుటుంబం నుంచి సుస్మిత బరిలోకి దిగే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగంగా మద్దతు ప్రకటించడం, దానికి సుస్మిత ఘాటుగా కౌంటర్ ఇవ్వడంతో పరకాల కాంగ్రెస్‌లో టికెట్ పోరు ఇప్పటి నుంచే రసవత్తరంగా మారింది. వచ్చే రోజుల్లో ఈ వివాదం మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఇందిరమ్మ ఇచ్చింది..
# రేవంత్ సర్కార్ లాక్కుంది



**సంగారెడ్డి జిల్లా, ప్రజా వాయిస్:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు అసెంబ్లీ నియోజకవర్గం లక్డాపూర్ పరిధిలో ఏళ్ల తరబడి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దళిత కుటుంబాల భూములపై అధికారులు చేపట్టిన చర్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండానే భారీ పోలీసు బందోబస్తు మధ్య భూములను స్వాధీనం చేసుకున్నారని 26 కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. తమకు గతంలో ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో భూములు కేటాయించారని, తమ వద్ద లావణి పట్టాలు, పాస్‌బుక్కులు సైతం ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. దాదాపు 22 ఎకరాల భూమిపై ఆధారపడి 26 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని, ప్రస్తుతం పొలాల్లో పంటలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా కంచెలు ఏర్పాటు చేసి భూమిని తమ ఆధీనంలోకి తీసుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు భూమి ఏ అవసరానికి స్వాధీనం చేసుకుంటున్నారు? ఏ ఉత్తర్వుల ఆధారంగా చర్యలు చేపట్టారు? బాధితులకు ముందస్తుగా నోటీసులు ఎందుకు ఇవ్వలేదు? అనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్రంగా వినిపిస్తున్నాయి. భూమి స్వాధీనం తప్పనిసరి అయితే నిబంధనల ప్రకారం పరిహారం, ప్రత్యామ్నాయ భూమి లేదా పునరావాసం కల్పించారా? అన్నదానిపైనా స్పష్టత లేదు. మరోవైపు అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ బోర్డుపై సర్వే నంబర్ 498లో 10 ఎకరాల భూమి HMWS&SB పరిధిలో ఉందని పేర్కొనడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. బాధితులు చెబుతున్న 22 ఎకరాలు, 26 కుటుంబాల భూముల వివరాలు ప్రభుత్వ స్వాధీనానికి ఎలా సంబంధం కలిగి ఉన్నాయో సంబంధిత అధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. లావణి పట్టాలు, పాస్‌బుక్కులు ఉన్న కుటుంబాలను నోటీసులు ఇవ్వకుండా భూముల నుంచి తొలగించే అధికారం ఎవరి ఆదేశాలతో వినియోగించారు? భూమి స్వాధీనానికి సంబంధించిన ఉత్తర్వులు ఏమిటి? పంట నష్టానికి పరిహారం ఎవరు చెల్లిస్తారు? పునరావాసం లేదా ప్రత్యామ్నాయ భూమి ఎక్కడ? అనే ప్రశ్నలకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.తరతరాలుగా ఈ భూమినే నమ్ముకుని బతుకుతున్నాం.. ఇప్పుడు భూమి కూడా లేకుండా చేస్తే మా కుటుంబాల పరిస్థితి ఏంటి..అంటూ బాధిత దళిత కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. పేదల భూముల విషయంలో చట్టపరమైన ప్రక్రియను పాటించారా..లేక అధికార బలంతో భూములను స్వాధీనం చేసుకున్నారా..అన్నది తేలాల్సి ఉంది.బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వారి తరఫున ప్రజా వాయిస్ ప్రశ్నిస్తూనే ఉంటుంది.

# సుస్మితపై ఎమ్మెల్యే నాగరాజు ఫైర్

మొదటి పేజీ తరువాయి

వర్ధన్నపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో కనీస సభ్యత్వం లేని వ్యక్తులు మాట్లాడే మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యాఖ్యలు చేసిన వారికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పారు. సీఎం స్థాయిని తగ్గించేలా మాట్లాడటం సరైంది కాదన్నారు.రేవంత్ రెడ్డి కాలి గోటికి కూడా సుస్మిత సరిపోరంటూ నాగరాజు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దమ్ముంటే ముఖ్యమంత్రిపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలని సవాల్ విసిరారు. సుస్మిత వెనుక ఎవరున్నారో తమకు తెలుసని, ఆమెకు రాజకీయంగా మాట్లాడే అర్హత లేదని విమర్శించారు.

**సమయం వచ్చినప్పుడు జవాబు ఇస్తా: రేవూరి..**

తనపై కొండా సుస్మిత చేసిన విమర్శలపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కూడా స్పందించారు. ఆమె వ్యాఖ్యలకు సమయం వచ్చినప్పుడు సరైన సమాధానం ఇస్తానని అన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, ముందు ముందు చాలా ఉందని వ్యాఖ్యానించారు.ముఖ్యమంత్రి నియోజకవర్గానికి వచ్చినప్పుడు స్థానిక ఎమ్మెల్యేలను ప్రోత్సహించడం సహజమని, అందులో భాగంగానే రేవంత్ రెడ్డి తనను మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారని రేవూరి తెలిపారు. ప్రజల్లో తనకున్న మంచి పేరు, ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగానే సీఎం తనను పరకాల అభ్యర్థిగా ప్రకటించారని పేర్కొన్నారు.

**వ్యక్తిగత విమర్శలకు స్పందించను..**

వ్యక్తిగత విమర్శలకు స్పందించి తన స్థాయిని తగ్గించుకోనని రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను పూర్తిగా ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. మంత్రి కొండా సురేఖతో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.తాను 1993 నుంచి రాజకీయాల్లో ఉన్నానని, రాజకీయాల్లో ఎవరి స్థాయి వారికి ఉంటుందని రేవూరి వ్యాఖ్యానించారు. ముందే కోయిలు కూసినట్లు సుస్మిత మాట్లాడుతున్నారని, ఆమె విమర్శలకు సరైన సమయంలో ధీటైన సమాధానం ఇస్తానని అన్నారు.పరకాల టికెట్ అంశంపై మొదలైన వివాదం ఇప్పుడు కాంగ్రెస్ నేతల పరస్పర విమర్శలకు దారితీసింది. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, కొండా సుస్మిత కౌంటర్, ఎమ్మెల్యేలు నాగరాజు, రేవూరి స్పందనలతో వరంగల్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# ఆందోళనకారులపై 'ఖాకీ' ప్రతాపం

- పాలిటెక్నిక్ విద్యార్థుల గొంతు పట్టుకున్న సీఐ.. వైరల్‌గా వీడియోలు
- ఆందోళన అడ్డుకునే క్రమంలో ఇద్దరు విద్యార్థుల గొంతు పట్టుకున్న వైనం
- సీఐ రఘుపతిరెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పోలీస్ దౌర్జన్య దృశ్యాలు
- శాంతియుత నిరసనపై పోలీసుల బలప్రయోగమంటూ విద్యార్థి సంఘాల ఆగ్రహం
- ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్



**ప్రజా వాయిస్,మహబూబాబాద్:** సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద శాంతియుతంగా ఆందోళనకు దిగిన పాలిటెక్నిక్ విద్యార్థులపై పోలీసుల దురుసు ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. నిరసనను అడ్డుకునే క్రమంలో టౌన్ సీఐ రఘుపతిరెడ్డి ఇద్దరు విద్యార్థుల గొంతు పట్టుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.విద్యార్థులను అదుపులోకి తీసుకునే క్రమంలో సీఐ వారి గొంతును కొంతసేపు గట్టిగా పట్టుకున్నట్లు వైరల్ వీడియోల్లో కనిపిస్తోంది. దీంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురైనట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేస్తున్న విద్యార్థులను సమన్వయంతో అదుపు చేయాల్సిన పోలీసులు ఇలా వ్యవహరించడం ఏమిటని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

# మైనర్ బాలికలను వ్యభిచారంలోకి దించిన కేసులో సంచలన తీర్పు.. 33 మందికి శిక్షలు

- 2015లో సీఐడీ నమోదు చేసిన పోక్సో కేసులో తీర్పు
- బాలికలను ప్రలోభపెట్టి వ్యభిచారంలోకి దించిన ముఠా
- 33 మందిని దోషులుగా నిర్ధారించిన నాంపల్లి పోక్సో కోర్టు
- ఐదుగురికి జీవిత ఖైదు.. ముగ్గురికి 14 ఏళ్ల జైలు
- 14 మందికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష
- తొమ్మిది మంది బాధిత బాలికలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం


**ప్రజా వాయిస్, హైదరాబాద్:** మైనర్ బాలికలను ప్రలోభాలకు గురిచేసి వ్యభిచారంలోకి దించిన కేసులో నాంపల్లి పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2015లో సీఐడీ నమోదు చేసిన పోక్సో కేసులో ముఠాకు చెందిన 33 మందిని దోషులుగా నిర్ధారించిన న్యాయస్థానం.. వారికి కఠిన శిక్షలు విధించింది. సుదీర్ఘకాలం కొనసాగిన ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం కోర్టు తుది తీర్పు ప్రకటించింది.

**తొమ్మిది మంది బాలికలను లక్ష్యంగా..**

2015లో సీఐడీ నమోదు చేసిన ఈ కేసులో ముఠా సభ్యులు మొత్తం తొమ్మిది మంది మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాలికలను వివిధ రకాలుగా ప్రలోభాలకు గురిచేసి వ్యభిచార రొంపిలోకి దించినట్లు పోలీసులు గుర్తించారు.కేసు విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను నాంపల్లి పోక్సో కోర్టు పరిశీలించింది. సుదీర్ఘ విచారణ అనంతరం నిందితుల పాత్రను నిర్ధారించిన న్యాయస్థానం.. 33 మందిని దోషులుగా తేల్చింది.

**ఐదుగురికి జీవిత ఖైదు..**

దోషుల్లో ఐదుగురికి నాంపల్లి పోక్సో కోర్టు జీవిత ఖైదు విధించింది. మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు శిక్ష, 14 మందికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. మిగిలిన దోషులకు కూడా కేసులో వారి పాత్రను బట్టి న్యాయస్థానం శిక్షలు ఖరారు చేసినట్లు సమాచారం.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- అసంపూర్తి కల్వర్టు పనులు వెంటనే పూర్తి చేయాలి
- సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**ప్రజా వాయిస్,పటాన్‌చెరు:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి శాశ్వత పరిష్కారం చూపడమే తన ప్రధాన లక్ష్యమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ, సాయికృపా కాలనీల్లో ఆయన పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కాలనీలో అసంపూర్తిగా ఉన్న కల్వర్టు నిర్మాణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మహిపాల్‌రెడ్డి.. కల్వర్టు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన సీసీ రోడ్లు, యూజీడీ వ్యవస్థ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ పర్యటనలో అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్, సీనియర్ నాయకులు జగదీష్, గోపాల్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.







# ఎండుతున్న వరి.. రైతుల గుండెల్లో గుబులు

- వర్షాలు ముఖం చాటేయడంతో బీటలువారుతున్న పొలాలు
- బోర్ల నుంచి అందని నీరు
- 24 గంటల కరెంటు కోసం 161 జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

**ప్రజా వాయిస్, సంగారెడ్డి:** వర్షాలు ముఖం చాటేయడంతో వరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత 20 రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంట పొలాలు ఎండిపోతూ బీటలువారుతున్నాయి. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అన్నాసాగర్, చింతకుంట గ్రామాలకు చెందిన రైతులు ఇప్పటికే వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు బోర్లపై ఆధారపడుతున్నారు. అయితే భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లలోనూ ఆశించిన స్థాయిలో నీరు రావడం లేదు. దీనికి తోడు విద్యుత్ కోతలు రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని చెబుతున్నా కనీసం ఎనిమిది గంటలు కూడా నిరంతరంగా కరెంటు రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడు కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఒక బోరు కింద మూడు ఎకరాల వరి సాగు చేస్తే రెండు ఎకరాలకు కూడా సరిపడా నీరు అందడం లేదని చెబుతున్నారు.వర్షాలు పడతాయన్న ఆశతో వరి నాట్లు వేసిన తమకు ఇప్పుడు పంటను కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు లేకపోవడంతో భూగర్భ జలాలు కూడా తగ్గిపోతున్నాయని పేర్కొంటున్నారు. పుల్కాల్ మండలం ముధుమాణిక్యం గిరిజన తండా సమీపంలోని పొలాల్లో నీరందక బీటలువారిన వరి పంటలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

### 161 జాతీయ రహదారిపై రాస్తారోకో

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ అందోల్ మండలం అన్నాసాగర్, చింతకుంట గ్రామాలకు చెందిన రైతులు సబ్‌స్టేషన్ ఎదుట 161 జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న జోగిపేట పోలీసులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.అనంతరం రెండు గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో రైతులు అందోల్ తహసీల్దార్ సాగర్ మధుకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పంటలను కాపాడుకునేందుకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. రైతుల సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

### 32,500 ఎకరాల్లో పంట నష్టం.?

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 32,500 ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే పంట నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలు పెట్టుబడి పెట్టిన పంట చేతికొస్తుందో లేదో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

# గురుకులాల్లో సిబ్బంది కరువు.. విద్యార్థుల పరిస్థితి దారుణం

- శాంతినగర్ మైనారిటీ కాలేజీలో లెక్చరర్లు, వార్డెన్ల కొరతపై బీఆర్ఎస్ నేత బొడ్డు రవీందర్ పటేల్ ఫైర్
- పోస్టులు భర్తీ చేయకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం

**ప్రజా వాయిస్, గోదావరిఖని:** రామగుండం కార్పొరేషన్ పరిధి శాంతినగర్‌లోని తెలంగాణ మైనార్టీ బాయ్స్ కళాశాలలో సిబ్బంది కొరత విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బొడ్డు రవీందర్ పటేల్ అన్నారు. బుధవారం కళాశాలను సందర్శించిన ఆయన విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్‌తో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.కళాశాలలో లెక్చరర్లు, వార్డెన్లు లేకపోవడంతో విద్యార్థులకు విద్యాబోధనతో పాటు వసతి, భద్రత విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వార్డెన్లు లేకుండా విద్యార్థుల భద్రత ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వ హయాంలో గురుకులాలను విస్తరించి పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించామని, ప్రస్తుత ప్రభుత్వం అవసరమైన సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యం చేస్తోందని రవీందర్ పటేల్ విమర్శించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నా ఈ పరిస్థితి నెలకొనడం విచారకరమన్నారు.వెంటనే లెక్చరర్లు, వార్డెన్లను నియమించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఈదునూరి శ్రీకాంత్, మేకల శ్రీనివాస్, ఒల్లాల మల్లేశం, పవన్ పత్యం, సదానందం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# మంథనిలో దోమల దండయాత్ర.. ప్రజలు విలవిల

- పోచమ్మవాడలో పడకేసిన పారిశుధ్యం
- దద్దుర్లు, జ్వరాలతో ఆస్పత్రుల బాట
- కాలువలు శుభ్రం చేసినా బ్లీచింగ్ ఊసే లేదు.. ఫాగింగ్‌కు దిక్కులేదు
- మంత్రి వస్తేనే హడావుడి.. ఆ తర్వాత ప్రజారోగ్యాన్ని గాలికొదిలేస్తున్నారన్న ఆరోపణలు
- మున్సిపల్ చైర్మన్ తీరుపై స్థానికుల ఆగ్రహం
- తక్షణ చర్యలకు డిమాండ్





**ప్రజా వాయిస్,మంథని:** మంథని పట్టణంలో దోమల బెడద రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మవాడలో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల పరిసరాలు, కాలువల్లో పేరుకుపోతున్న మురుగు, నిల్వ నీటితో దోమలు విజృంభిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల కాటుతో దద్దుర్లు రావడంతో పాటు పలువురు తీవ్ర జ్వరాల బారిన పడుతూ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

### బ్లీచింగ్ చల్లడం మరిచారు

పోచమ్మవాడలో డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసిన అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించడం వంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా కాలువల్లో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయని అంటున్నారు. పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

### మంత్రి వస్తేనే హడావుడి.?

రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు మంథని ప్రాంతంలో పర్యటించే సమయంలోనే మున్సిపల్ యంత్రాంగం హడావుడిగా పారిశుధ్య పనులు చేపడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మంత్రి పర్యటన ముగిసిన తర్వాత పరిస్థితి మళ్లీ యథాతథంగా మారుతోందని విమర్శిస్తున్నారు. ప్రజారోగ్యంపై నిరంతర పర్యవేక్షణ లేకపోవడంతోనే సమస్య తీవ్రరూపం దాల్చిందని చెబుతున్నారు.

### తక్షణ చర్యలు చేపట్టాలి

పట్టణంలో దోమల నివారణకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పోచమ్మవాడలో కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ యంత్రాంగం నిరంతర పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# చెరువు శిఖం కబ్జా.. చేపల చెరువుల దందా

- 50 ఎకరాల శిఖం భూమిలో అక్రమ తవ్వకాలు
- రెండు కిలోమీటర్ల కాల్వ..భారీ మోటార్లతో నీటి తరలింపు రైతులకు కష్టాలు
- అధికారుల మౌనం.. పోలీసుల బెదిరింపులపై ఆరోపణలు
- అక్రమ చెరువులపై చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్



**ప్రజా వాయిస్, సంగారెడ్డి:** చెరువు శిఖం భూమే లక్ష్యంగా అక్రమ చేపల చెరువుల తవ్వకాలు సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మెదక్,సంగారెడ్డి జిల్లాల సరిహద్దులోని అందోల్ మండలం కన్సాన్‌పల్లి, అల్లాదుర్గ్ మండలం గడిపెద్దాపూర్ పరిధిలోని సుమారు 150 ఎకరాల పెద్ద చెరువుకు చెందిన దాదాపు 50 ఎకరాల శిఖం భూమిలో చేపల చెరువులు తవ్వినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువులో నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర కాల్వ తవ్వి, భారీ మోటార్లతో నీటిని చేపల చెరువులకు తరలిస్తున్నారని రైతులు వాపోతున్నారు.అనుమతులు లేకుండానే విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో చెరువు కింద పంటలు సాగు చేసుకునే రైతులకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రైతులు చెరువు నుంచి నీటిని తరలిస్తే కేసులు పెట్టే అధికారులు.. ఇక్కడ మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.చేపల చెరువుల యజమానులను ప్రశ్నించిన వారిని పోలీసులు బెదిరించినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీల సమయంలో భారీ మోటార్లు, పైపులు, తవ్వకాలకు ఉపయోగించిన యంత్రాలు కనిపించినప్పటికీ వాటిని సీజ్ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### అనుమతులు లేకుండానే తవ్వకాలు.?

చేపల చెరువుల ఏర్పాటుకు సంబంధిత శాఖల అనుమతులు, ఎన్ఓసీలు అవసరమని రైతులు చెబుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మత్స్య, విద్యుత్ తదితర శాఖల అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపట్టారని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి శిఖం భూమిలో తవ్విన అక్రమ చేపల చెరువులను తొలగించాలని, చెరువు నీటిని ప్రైవేటు చెరువులకు తరలించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్డుపై మృత్యువుతో పోరాటం

- సర్వీస్ రోడ్డు అరకొర పనులతో ప్రయాణికులకు ప్రాణ సంకటం
- టోల్ వసూళ్లలో దూకుడు.. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం
- బస్టాండ్ సమీపంలో ప్రమాదాలకు పొంచి ఉన్న ముప్పు
- హెచ్‌కేఆర్ తీరుపై స్థానికుల తీవ్ర ఆగ్రహం

**ప్రజా వాయిస్, గోదావరిఖని:** టోల్ వసూళ్లకు మాత్రం వెనుకాడరు.. ప్రజల ప్రాణాల భద్రతకు మాత్రం పట్టింపులేదా రాజీవ్ రహదారిపై గోదావరిఖని బస్టాండ్ సమీపంలో సర్వీస్ రోడ్డు అరకొర నిర్మాణంతో ప్రయాణికులు నిత్యం మృత్యువుతో పోరాడాల్సిన దుస్థితి నెలకొంది. రహదారి పనులు పూర్తికాకపోవడంతో వాహనాలు ప్రధాన రహదారిపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీంతో రద్దీ సమయాల్లో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది.సర్వీస్ రోడ్డు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటే స్థానిక వాహనాల రాకపోకలకు కొంత ఉపశమనం లభించేది. కానీ పనులను మధ్యలోనే వదిలేయడంతో వాహనదారులతోపాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు అరకొర రోడ్డుపై నీరు నిలిచి, మురుగునీరు చేరడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రాత్రివేళ ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. టోల్ కట్టించుకోవడంలో ఉన్న శ్రద్ధ.. రోడ్డు పూర్తి చేయడంలో ఎందుకు లేదు అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. కోట్లాది రూపాయలు టోల్‌గా వసూలు చేస్తున్న సంస్థ కనీస రహదారి సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతోందని మండిపడుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అరకొరగా ఉన్న సర్వీస్ రోడ్డు పనులను పూర్తి చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరో ప్రాణం బలయ్యేలోపే అధికారులు మేల్కొని.. సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



# ఆప్యాయతకు చిరునామాగా నిలిచిన సరస్వతి అక్కకు కన్నీటి వీడ్కోలు

- మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్ హోంగార్డ్ మృతి
- జిల్లా పోలీస్ యంత్రాంగంలో విషాదం
- విధి నిర్వహణలో నిబద్ధత
- ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన సరస్వతి
- పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారిని సొంత మనుషుల్లా పలకరించే ఆత్మీయత
- తమ్ముడు.. నువ్వెందుకు వచ్చావు.. ఏదైనా ఉంటే ఫోన్ చేయి అంటూ చూపిన ఆప్యాయత జ్ఞాపకాలు
- సరస్వతి మృతి పట్ల పోలీస్ సిబ్బంది, ప్రజా వాయిస్ తరపున సంతాపం

**ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం**, మాడుగుల పల్లి.నల్గొండ జిల్లా మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహించిన సరస్వతి మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. ఆమె మరణవార్తతో జిల్లా పోలీస్ యంత్రాంగంతో పాటు, ఆమెతో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరూ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉంటూనే.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ ఆప్యాయత, అనురాగాలతో పలకరిస్తూ సరస్వతి అందరి మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.పోలీస్‌స్టేషన్ అంటే కేవలం అధికారిక వ్యవహారాలకు వేదిక కాదని.. అక్కడికి వచ్చే ప్రతి వ్యక్తితో మానవీయంగా మెలగాలనే భావనను తన ప్రవర్తనతో చూపించిన వ్యక్తిగా సరస్వతి గుర్తుండిపోతారు. చిన్నవారైనా, పెద్దవారైనా తన ఆప్యాయమైన పలకరింపుతో పలకరించడం.. అవసరమైనప్పుడు ఆప్యాయంగా మాట్లాడటం ఆమె సహజ స్వభావంగా ఉండేది. అందుకే ఆమెను పరిచయం ఉన్నవారు కేవలం హోంగార్డుగా కాకుండా ఆప్యాయమైన అక్కగా గుర్తు చేసుకుంటున్నారు.కొన్ని నెలల క్రితం మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్‌కు ప్రజా వాయిస్ ప్రతినిధి నడ్డి శివకృష్ణ యాదవ్ వెళ్లిన సమయంలో జరిగిన సంఘటన ఆమె ఆప్యాయతకు నిదర్శనం. తమ్ముడు.. నువ్వెందుకు వచ్చావు..అంటూ పలకరించి, వాటర్ బాటిల్ తెప్పించి నీళ్లు తాగించిన తీరు ఇప్పటికీ జ్ఞాపకాలలో నిలిచిపోయింది. అంతేకాదు..ఏదైనా ఉంటే ఫోన్ చేయి.. నువ్వు రావద్దు అంటూ ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు తలుచుకుంటే కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఆ మాటల్లో ఉన్న ఆప్యాయత, అభిమానం ఆమె మనసు ఎంత మంచిదో తెలియజేస్తాయి.సరస్వతి అక్క లేరనే వార్తను నమ్మడం కష్టంగా ఉందని ఆమెను పరిచయం ఉన్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో తన బాధ్యతను నిర్వర్తిస్తూ.. తన చుట్టూ ఉన్నవారితో మానవీయంగా మెలిగిన ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ చెరిగిపోవని పలువురు పేర్కొంటున్నారు.జిల్లా పోలీస్ యంత్రాంగం ఒక ఆప్యాయమైన సహచరిని కోల్పోగా.. ప్రజా వాయిస్ ఒక ఆత్మీయమైన అక్కను కోల్పోయింది. సరస్వతి అక్క చూపిన ప్రేమ, పలకరించిన తీరు, పంచిన ఆప్యాయతను ఆమెతో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరూ జీవితాంతం గుర్తుంచుకుంటారు.నీ ఆత్మకు శాంతి చేకూరాలని, నీ కుటుంబ సభ్యులకు ఈ అపారమైన విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రజా వాయిస్ మనస్ఫూర్తిగా కోరుకుంటోంది.కన్నీటి వీడ్కోలు సరస్వతి అక్క.నిన్ను మరువలేం.. నీ జ్ఞాపకాలను మరచిపోలేం.





## ఓబీ మట్టి రవాణాతో.. రోడ్డు ఖతం

- ఓవర్‌లోడ్ వోల్వోలతో రూ.40 లక్షల రోడ్డు ఛిద్రం
- ప్రమాదంలో సింగరేణి కార్మికుడి కాలు పోయిందని ఆరోపణ
- సింగరేణి నిధులతో మరమ్మతులపై అనుమానాలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తాం: బీజేపీ నేత మొలుమూరి శ్రీనివాస్

**ప్రజా వాయిస్, రామగిరి:** ఓబీ మట్టి రవాణా కోసం తిరుగుతున్న భారీ వోల్వో లారీలతో రూ.40 లక్షల ప్రజాధనం బూడిదైందని బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ ఆరోపించారు. సింగరేణి ఆర్‌జీ–3 పరిధి నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఓబీ మట్టి తరలిస్తున్న ఓవర్‌లోడ్ లారీల కారణంగా పన్నూరు సెంటర్ నుంచి ఏఎల్‌పీ మైన్, జీఎం కార్యాలయం, జేఎన్‌టీయూ మార్గంలోని రోడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు.

**ఓవర్‌లోడ్‌కు అడ్డుకట్టేదీ.?**

భారీ లారీల రాకపోకలతో రోడ్డు దెబ్బతినడమే కాకుండా ఇటీవల జరిగిన ప్రమాదంలో ఓ సింగరేణి కార్మికుడు కాలు కోల్పోయారని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీ మట్టి రవాణాకు అనుమతులు ఎవరు ఇచ్చారు లారీల్లో ఎంత మేరకు లోడ్ చేస్తున్నారు నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**సింగరేణి నిధులెందుకు.?**

గతంలో రోడ్డును ప్రైవేట్ కాంట్రాక్టర్లే పునర్నిర్మిస్తారని అధికారులు చెప్పారని, ప్రస్తుతం సింగరేణి సొంత నిధులతో మరమ్మతులు చేపట్టడంపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. మట్టి రవాణా అనుమతులు, లారీల ఓవర్‌లోడ్, రోడ్డు మరమ్మతులకు వెచ్చిస్తున్న నిధుల పూర్తి వివరాలను యాజమాన్యం ప్రజలకు వెల్లడించాలని కోరారు.

**కేంద్రానికి ఫిర్యాదు**

కార్మికుల నివాస ప్రాంతాల్లో కనీస సదుపాయాలు కల్పించకుండా ప్రైవేట్ కాంట్రాక్టర్లకు నిధులు ధారాదత్తం చేస్తున్నారనే ఆరోపణలపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి, విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని శ్రీనివాస్ స్పష్టం చేశారు. రోడ్డు ధ్వంసానికి, ప్రమాదాలకు కారణమవుతున్న ఓవర్‌లోడ్ లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కోదాడలో నకిలీ ఆయిల్ కలకలం

- ఆటోమొబైల్ దుకాణంలో సీసీఎస్ పోలీసుల తనిఖీలు
- 20 నకిలీ ఆయిల్ టిన్లు స్వాధీనం



**ప్రజా వాయిస్, కోదాడ:** కోదాడ పట్టణంలో నకిలీ హెచ్‌పీసీఎల్ హైడ్రాలిక్ ఆయిల్ విక్రయిస్తున్నారన్న సమాచారంతో సీసీఎస్ పోలీసులు, హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం రాత్రి మేళ్లచెరువు రోడ్డులోని ఓ ఆటోమొబైల్ దుకాణంలో చేపట్టిన తనిఖీల్లో నకిలీదిగా అనుమానిస్తున్న 20 ఆయిల్ టిన్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌పీసీఎల్ బ్రాండ్ పేరుతో నకిలీ హైడ్రాలిక్ ఆయిల్ విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు కంపెనీ ప్రతినిధులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. దీంతో రంగంలోకి దిగిన సీసీఎస్ పోలీసులు దుకాణంలో తనిఖీలు చేపట్టారు. కంపెనీ అసలైన ఉత్పత్తులతో పోల్చి చూడగా అనుమానాస్పదంగా ఉన్న 20 ఆయిల్ టిన్లు గుర్తించారు.స్వాధీనం చేసుకున్న టిన్ల నాణ్యత, తయారీ వివరాలు, ప్యాకేజింగ్, సరఫరా మార్గాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు మేరకు దుకాణ యజమానులను విచారిస్తున్నట్లు సమాచారం. నకిలీ ఆయిల్ ఎక్కడి నుంచి వచ్చింది దీని వెనుక సరఫరాదారులు ఎవరైనా ఉన్నారా ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేశారా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.స్వాధీనం చేసుకున్న ఆయిల్ నమూనాలను పరీక్షలకు పంపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విచారణ పూర్తయిన అనంతరం కేసు నమోదు, తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. నకిలీ ఆటోమొబైల్ ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు దృష్టి సారించడంతో ఈ ఘటన కోదాడలో చర్చనీయాంశంగా మారింది.

## కాసులాబాద్‌కు రహదారి కష్టాలు.. రోడ్డు లేదు.. సాయం రాదు

- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాసులాబాద్ వాసుల ప్రయాణం
- గుంతలమయమైన రహదారితో నిత్యం నరకయాతన
- అత్యవసర వేళ అంబులెన్స్ కూడా రావడం లేదంటున్న గ్రామస్తులు

**ప్రజా వాయిస్, మిరుదొడ్డి:** సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని కాసులాబాద్ గ్రామ ప్రజలకు రహదారి కష్టాలు తప్పడం లేదు. కాసులాబాద్ నుంచి హబ్సిపూర్ మీదుగా మిరుదొడ్డికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.మండల కేంద్రంలోని ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు విద్య, వైద్యం, నిత్యావసరాలు, వ్యవసాయ ఎరువుల కోసం ఈ మార్గంపైనే ఆధారపడాల్సి వస్తోందని గ్రామస్తులు తెలిపారు. రహదారి అధ్వానంగా ఉండటంతో పలువురు ప్రమాదాలకు గురై గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌కు ఫోన్ చేసినా రోడ్డు పరిస్థితి బాగోలేదంటూ సిబ్బంది రావడానికి నిరాకరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో అత్యవసర వైద్యం అందక రోగుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని వాపోయారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కాసులాబాద్,హబ్సిపూర్ రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టి నూతన రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధులు, అధికారులను గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.



# పల్లె పల్లెకూ పొన్నం.. ప్రజల చెంతకే పాలన

- దుద్దెనపల్లి, ఏక్లాస్‌పూర్‌లో పల్లె దవాఖానాల ప్రారంభం
- దుద్దెనపల్లి,మొగిలిపల్లి వారధికి రూ.3.56 కోట్లు మంజూరు
- గ్రామాల్లో ప్రజల నుంచి వినతులు
- అక్కడికక్కడే అధికారులతో సమీక్ష
- 173 గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యం
- మంత్రి పొన్నం






**ప్రజా వాయిస్,హుస్నాబాద్:** కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విస్తృతంగా పర్యటించారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న.. పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి, ఏక్లాస్‌పూర్, సోమారం, గర్రెపల్లి గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.40 లక్షల వ్యయంతో దుద్దెనపల్లి, ఏక్లాస్‌పూర్ గ్రామాల్లో నిర్మించిన నూతన పల్లె దవాఖానలను మంత్రి ప్రారంభించారు. దుద్దెనపల్లి–మొగిలిపల్లి మధ్య వారధి నిర్మాణానికి రూ.3.56 కోట్లు మంజూరైనట్లు ప్రకటించారు.

**ప్రజల నుంచి వినతులు..అధికారులకు ఆదేశాలు**

ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, రైతులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్థానిక, వ్యక్తిగత సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే సమీక్ష నిర్వహించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, రైతు భరోసా, రుణమాఫీ తదితర సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, ఇతర బాధితులు కొత్త పింఛన్ల కోసం ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**173 గ్రామాల్లో పర్యటన**

గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో నేరుగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులు ఆయిల్‌పామ్, ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని, 'జలసిరి' పథకం ద్వారా వర్షపు నీటిని సంరక్షించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మందు కొట్టారు.. పంట కొట్టుకుపోయింది

- 8 ఎకరాల వరి పంట ఎర్రబారి నాశనం
- రూ.8 వేల మందు పిచికారీ చేసిన రైతులకు కష్టాలు
- కంపెనీ చుట్టూ తిరిగినా స్పందన కరువు
- పంట నష్టంపై అధికారుల విచారణకు డిమాండ్



**ప్రజా వాయిస్,అశ్వారావుపేట:** కలుపు నివారణ కోసం మందు కొంటే.. ఉన్న పంటకే ఎసరు వచ్చింది. గ్రోమోర్ కంపెనీలో కొనుగోలు చేసిన కలుపు మందును పిచికారీ చేసిన కొద్ది రోజులకే 8 ఎకరాల వరి పంట ఎర్రబారి దెబ్బతిందని ఇద్దరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్నపరెడ్డిపల్లి పట్టణంలోని మన గ్రోమోర్ షాపులో ఆగస్టు 3న సుమారు రూ.8 వేల విలువైన మందును కొనుగోలు చేసి పిచికారీ చేసినట్లు తెలిపారు. కలుపు నివారణ కాకపోగా పంట దెబ్బతినడంతో కంపెనీ సిబ్బందిని సంప్రదించినా పట్టించుకోలేదని ఆరోపించారు.

**కంపెనీ చుట్టూ ప్రదక్షిణలు**


పంట పరిస్థితిని గమనించిన రైతులు పలుమార్లు కంపెనీ సిబ్బందిని సంప్రదించినా 'చూద్దాంలే' అంటూ కాలయాపన చేశారని వాపోయారు. మందు వల్లే పంట దెబ్బతిందా? లేక ఇతర కారణమా? అన్నది తేల్చేందుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న తమకు ఈ నష్టం మరింత భారంగా మారిందన్నారు.

**అవగాహన లేని సిబ్బందితో విక్రయాలా.?**

రైతులకు పురుగుమందులు, కలుపు నివారణ మందుల వినియోగంపై పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత విక్రయ కేంద్రాలపై ఉంది. ఏ పంటకు ఏ మందు.. ఎంత మోతాదులో.. ఎప్పుడు పిచికారీ చేయాలో వివరించాల్సి ఉంటుంది. అయితే అవగాహన లేని సిబ్బందితో మందులు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**తనిఖీలు చేస్తున్నాం: ఏవో**

ఎరువులు, మందుల దుకాణాల్లో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని వ్యవసాయ శాఖ ఏవో అనూష తెలిపారు. రైతులు నేరుగా తమను సంప్రదించి వివరాలు అందిస్తే పంటను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సిబ్బందిలో ఒకరు మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారని పేర్కొన్నారు.



**పంట నష్టంపై విచారణ చేయాలి**

మందు పిచికారీ చేసిన తర్వాతే పంట ఎర్రబారిందని రైతులు చెబుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని స్థానికులు కోరుతున్నారు. పంట నష్టానికి కారణాలను శాస్త్రీయంగా నిర్ధారించి బాధిత రైతులకు న్యాయం చేయాలని, తప్పు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## అన్నల ఆగడాలతో తమ్ముడి కుటుంబం రోడ్డుపాలు

- 2006 నుంచి భూ వివాదం..
- అన్నలు అమ్ముకున్న భూమి లెక్క తేల్చి.. తన వాటా ఇవ్వాలని వేడుకోలు
- పొలం దున్ననీయకుండా అడ్డంకులు.. ఇందిరమ్మ ఇల్లు కూడా నిలిపివేత
- గుడిసెలోనే జీవనం.. న్యాయం చేయకుంటే సావే శరణ్యమంటున్న మహేందర్

**ప్రజా వాయిస్,కోనరావుపేట:** అన్నదమ్ముల మధ్య నెలకొన్న భూ వివాదం ఓ కుటుంబాన్ని రోడ్డున పడేసింది. తమ అన్నలు 2006 నుంచి వేధింపులకు గురిచేస్తున్నారని రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల పరిధిలోని మరిమడ్ల గ్రామానికి చెందిన పస్నూరి మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. భూమి విషయంలో న్యాయం చేయాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తండ్రి పస్నూరి శంకర్ ముగ్గురు కుమారులు వేరుపడకముందే ఎకరం 6 గుంటల భూమిని విక్రయించారు. అనంతరం అన్నదమ్ములు వేరుపడిన తర్వాత పస్నూరి అశోక్, రమేష్‌లు చెరో ఎకరం 6 గుంటలు, ఎకరం 7 గుంటల భూమిని విక్రయించినట్లు తెలిపారు. ప్రస్తుతం మిగిలిన మూడు ఎకరాల భూమి విషయంలో వివాదం నెలకొంది.తన అన్నలు ఇప్పటికే విక్రయించుకున్న భూమిని పరిగణనలోకి తీసుకుని తనకు కూడా ఎకరం 6 గుంటల భూమిని పక్కన పెట్టి, మిగిలిన భూమిని ముగ్గురూ పంచుకుందామని కోరుతున్నట్లు మహేందర్ తెలిపారు. అయితే అందుకు అన్నలు అంగీకరించకుండా మొత్తం మూడు ఎకరాలను ముగ్గురూ చెరో ఎకరం తీసుకోవాలంటూ పట్టుబడుతున్నారని ఆరోపించారు.పొలం దున్ననీయకుండా అడ్డుకోవడంతోపాటు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కూడా ఆటంకాలు కల్పించారని మహేందర్ వాపోయారు. దీంతో ఇల్లు రద్దయి ప్రస్తుతం గుడిసెలోనే కుటుంబంతో జీవించాల్సి వస్తోందని కన్నీటిపర్యంతమయ్యారు ఇప్పటికైనా అధికారులు స్పందించి భూ వివాదాన్ని పరిష్కరించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని మహేందర్ కోరుతున్నారు. సమస్యకు పరిష్కారం చూపకపోతే తమ కుటుంబం పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని, తమకు సావే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



# రూ.12 లక్షల నిధుల గోల్‌మాల్.. కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

- రూ.11 లక్షల చెక్కులు బౌన్స్.. సొసైటీ సొమ్ము వ్యక్తిగత ఖాతాకు మళ్లింపు
- పెట్రోల్ బంక్ పేరుతో అనధికారిక చెల్లింపులు.. నకిలీ వోచర్లతో లెక్కల మాయ
- ఒకే వోచర్‌పై వేర్వేరు తేదీల్లో క్లెయిమ్‌లు.. కార్యాలయ అడ్రస్ లేని సంస్థకు నిధుల బదిలీ
- సబ్ కలెక్టర్ విచారణ నివేదికతో కదిలిన ఉన్నతాధికారులు
- శాఖాపరమైన విచారణ వేగవంతం

**ప్రజావాయిస్, నారాయణఖేడ్:** సహకార సంఘంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కార్యదర్శిపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం బొక్కస్‌గావ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) కార్యదర్శి ఎం.సతీష్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ సహకార సంఘాల చట్టం–1964లోని సెక్షన్ 59 కింద శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

**రూ.12 లక్షలు పక్కదారి**

పెట్రోల్ బంక్ ప్రాజెక్టు ఏర్పాటు పేరుతో ఎలాంటి చట్టబద్ధ అనుమతులు, ఒప్పందాలు లేకుండానే విజయవాడకు చెందిన మెస్సర్స్ దివ్య ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.12 లక్షల సొసైటీ నిధులను అనధికారికంగా మళ్లించినట్లు విచారణలో తేలింది. ఆ సంస్థ ఇచ్చిన రూ.11 లక్షల చెక్కులు బౌన్స్ కావడం మరింత కలకలం రేపింది. మరోవైపు సొసైటీకి చెందిన రూ.6.30 లక్షలను నిబంధనలకు విరుద్ధంగా కార్యదర్శి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు.

**వోచర్లలోనూ వక్రీకరణ**

2020–21లో సూత్లి, దారం సరఫరా కోసం కేటాయించిన రూ.1.50 లక్షల వ్యయానికి సరైన లెక్కలు చూపలేదని తేలింది. వోచర్లలో సరఫరాదారుల పేర్లు మార్చడం, చెల్లుబాటయ్యే జీఎస్టీ ఇన్‌వాయిస్‌లు లేకపోవడం, నగదు స్వీకరణ రసీదులు సక్రమంగా లేకపోవడం వంటి అక్రమాలు బయటపడ్డాయి. ఒకే వోచర్‌పై వేర్వేరు తేదీల్లో క్లెయిమ్‌లు సృష్టించినట్లు విచారణలో వెల్లడైంది.

**సస్పెన్షన్‌తో కఠిన ఆంక్షలు**

నారాయణఖేడ్ డివిజన్ సబ్ కలెక్టర్ ప్రాథమిక విచారణ జరిపి ఇచ్చిన నివేదిక ఆధారంగా అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో జారీ చేసిన షోకాజ్ నోటీసుకు సతీష్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెన్షన్ కాలంలో ఉన్నతాధికారుల లిఖితపూర్వక అనుమతి లేకుండా సొసైటీ కార్యాలయంలోకి ప్రవేశించరాదని, పరిపాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదని ఆదేశించారు. రికార్డులు, ఆన్‌లైన్ పోర్టల్స్‌ను ముట్టుకోరాదని, బాధ్యతలను వెంటనే మరొకరికి అప్పగించాలని స్పష్టం చేశారు. గల్లంతైన నిధులు, బౌన్స్ అయిన చెక్కుల రికవరీపై శాఖాపరమైన విచారణను వేగవంతం చేశారు.





# రూ.219.67 కోట్లతో రహదారులకు మహర్దశ

- ఏడాదిలోగా పెద్దపల్లి బైపాస్ పూర్తి చేస్తాం
- సుల్తానాబాద్ బైపాస్ కు కేంద్రంతో చర్చిస్తాం
- జిల్లాకు రూ.1,700 కోట్ల రోడ్డు పనులు మంజూరు
- రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లాలి
- మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, శ్రీధర్ బాబు

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్:** రహదారుల అభివృద్ధితో పరిశ్రమల విస్తరణకు ఊతమిచ్చి, స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో బుధవారం రూ.219.67 కోట్ల విలువైన రహదారి అభివృద్ధి పనులకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి బైపాస్ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సుల్తానాబాద్ బైపాస్ మంజూరుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. రహదారుల అభివృద్ధి జరిగితే పారిశ్రామిక ప్రగతి వేగవంతమై స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దపల్లి జిల్లాకు రూ.1,700 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు చేసిందన్నారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.వ్యవసాయ రంగంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు మళ్లి అధిక ఆదాయం పొందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. పెద్దపల్లి బైపాస్ నిర్మాణానికి రూ.82 కోట్లు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు వెల్లడించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లు.. రైతుల సాగునీరు గాలికేనా..?

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కోదాడకు అన్యాయం
- అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి
- రూ.5 వేల కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఏమైంది?
- పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలి
- సమీక్షలు, ప్రకటనలతో కాలయాపన వద్దు
- క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలి
- హామీలు మాటల్లో కాదు.. చేతల్లో చూపాలి
- ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి చూపాలి
- సంక్షేమ పథకాల అమలులో జాప్యం
- ఎమ్మెల్యే, మంత్రిపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఫైర్

**ప్రజా వాయిస్,కోదాడ:** కోదాడ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని, పేదలు, రైతుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పట్టించుకోవడం లేదని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. బుధవారం మోతే మండల పరిధిలోని మామిళ్లగూడెం సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా కేవలం 500 నుంచి 600 ఇళ్లకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం దారుణమన్నారు. సొంత ఇళ్లు లేక పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, గ్రామాల వారీగా అర్హులను గుర్తించి పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ జోక్యానికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు.

### రూ.5 వేల కోట్ల లిఫ్ట్ ఎక్కడ.?

మోతె మండలానికి రూ.5 వేల కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారని, అయితే పనులను వేగవంతం చేయడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని బొల్లం మండిపడ్డారు. ప్రాజెక్టు పూర్తయితే మోతెతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారమవుతుందనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు.ప్రచారానికే పరిమితం కాకుండా పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? ఎన్ని దశల్లో పూర్తి చేస్తారు? ఎంత మేర నిధులు విడుదల చేస్తారు? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమీక్షలు, ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించి పురోగతి చూపించాలని అన్నారు.

### సమస్యలపై క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలి

గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారు. రైతులకు సాగునీరు, పేదలకు ఇళ్లు అందించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆర్భాటం కంటే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ముఖ్యమని పేర్కొన్నారు. పేదలకు ఇళ్లు, రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైతే రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.



# కాసుల వేటలో కమర్షియల్ కట్టడాలు..!

- మేడలు పెరుగుతున్నాయి.. అద్దె దందా విస్తరిస్తోంది
- అధికారులు మాత్రం నిద్ర వీడటం లేదు!
- విద్యార్థులే టార్గెట్.. ఒక్కొక్కరి నుంచి రూ.7 వేల అద్దెకు బోర్డుల ప్రదర్శన!
- డ్రైనేజీకి దిక్కులేదు.. భద్రతకు భరోసా లేదు.. అద్దె వసూళ్లకు మాత్రం బోర్డులు రెడీ!
- అయినా ఒక్క నోటీసు లేదు.. తనిఖీ లేదు.. చర్య లేదు
- ఇదేం మున్సిపల్ రాజ్యం అంటూ మండిపడుతున్న జనాలు



**మొయినాబాద్ (ప్రజావాయిస్ ):** 111జీవో నిబంధనలు ఉన్నది ఎందుకు..? వాటిని అమలు చేయాల్సిన అధికారులు ఉన్నది ఎందుకు..? మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిల్కూరు రెవెన్యూ ప్రాంతంలో, జేబీఐఈటీ ఎదురుగా జరుగుతున్న భారీ నిర్మాణాలను చూస్తే ఈ ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.కాసుల వేటలో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.విద్యార్థులను టార్గెట్ చేస్తూ ఒక్కొక్కరికి నెలకు రూ.7 వేల అద్దె అంటూ ఏకంగా బోర్డులు ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. నిర్మాణం పూర్తికాకముందే అద్దె దందాకు రంగం సిద్ధం కావడం చూస్తుంటే కాసులే లక్ష్యమా? నిబంధనలు ఏమయ్యాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.డ్రైనేజీకి దిక్కులేదు.. భద్రతకు భరోసా లేదు.. అద్దె వసూళ్లకు మాత్రం బోర్డులు రెడీ! వందలాది మంది విద్యార్థులు నివసించే భవనాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫైర్ సేఫ్టీ తదితర అంశాలపై అధికారులు తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది.అయితే ఇప్పటివరకు నోటీసు లేదు.. తనిఖీ లేదు.. చర్య లేదు! కళ్లముందే నిర్మాణాలు జరుగుతున్నా అధికారులకు కనిపించడం లేదా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### అధికారుల కళ్లముందే నిబంధనలకు సమాధి

విచ్చల విడిగా అక్రమాలు జరుగుతున్నా అయినా అధికారులు మౌనం వీడటం లేదు! ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను బయటపెట్టి, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా? లేక కాసులుంటే కట్టుకోండి అన్న పరిస్థితికే మౌన అనుమతి ఇస్తారా? అన్నది వేచి చూడాలి.



# భూకబ్జాదారులకు మంత్రి పొంగులేటి స్ట్రాంగ్ వార్నింగ్

- ఆక్రమణలు తొలగించి.. పేదలకే ప్రభుత్వ భూములు
- అర్హులందరికీ పింఛన్లు.. 31లోగా దరఖాస్తు చేసుకోవాలి
- చెరువుమాదారంలో సోలార్ ప్లాంట్ ప్రారంభం
- దివ్యాంగులకు 100 శాతం సబ్సిడీతో త్రీవీలర్లు పంపిణీ

**ప్రజా వాయిస్, ఖమ్మం:** ప్రభుత్వ భూములను ఆక్రమించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయిస్తామని హెచ్చరించారు. పాలేరు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు.నేలకొండపల్లి మండలం చెరువుమాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. సౌర విద్యుత్‌తో విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.అర్హులైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఈ నెల 31లోగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ.. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో అర్హులకు 100 శాతం సబ్సిడీతో త్రీవీలర్ సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎత్తం పంచాయతీలో నిధుల గోల్‌మాల్

- ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్
- సర్పంచ్ , ఉపసర్పంచ్ లకు షోకాజ్ నోటీసులు
- నిబంధనలకు విరుద్ధంగా నిధుల వినియోగంపై విచారణ
- రికార్డులు, బిల్లులు, చెల్లింపుల పరిశీలన
- బాధ్యులపై మరిన్ని శాఖాపరమైన చర్యలకు అవకాశం
- కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశాలతో అధికారుల కొరడా



**ప్రజా వాయిస్.. నాగర్‌కర్నూల్:** గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ కొరడా ఝుళిపించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని కోడేరు మండలం ఎత్తం, ఎర్రన్నబావి తాండ గ్రామపంచాయతీలకు చెందిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎత్తం సర్పంచ్ బి.లక్ష్మి, ఉపసర్పంచ్ బి.ధర్మరాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.ప్రస్తుతం ఎత్తం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రమేష్‌తో పాటు, గతంలో అక్కడ పనిచేసి ప్రస్తుతం ఎర్రన్నబావి తాండ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బి.నరసింహాను సస్పెండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన అభివృద్ధి నిధుల వినియోగంలో నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టారు.నిధుల వినియోగం, అభివృద్ధి పనులు, బిల్లులు, చెల్లింపులకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన అనంతరం కలెక్టర్ ఈ చర్యలు తీసుకున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు. ప్రభుత్వ నిధులను ప్రజా ప్రయోజనాల కోసం నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని, పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.విచారణలో నిధుల వినియోగంలో నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై మరిన్ని శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని డీపీవో శ్రీరాములు వెల్లడించారు.

# బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో దళారుల చేతివాటం..?

- ప్రభుత్వ కార్యాలయంలోనే మధ్యవర్తుల మకాం.. అధికారుల మౌనం ఎందుకు.?
- ఉదయం నుంచి సాయంత్రం వరకు బయటి వ్యక్తుల స్వైరవిహారం
- సామాన్యుల అవసరాలే పెట్టుబడిగా పనులు చక్కబెడతామంటూ హామీలు
- దళారుల జోక్యంపై కలెక్టర్ స్థాయి అధికారులు విచారణ చేయాలంటున్న ప్రజలు



**ప్రజా వాయిస్,బూర్గంపాడు:** బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో దళారుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు నేరుగా అందాల్సిన రెవెన్యూ సేవల మధ్య కొందరు మధ్యవర్తులు జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయం తెరిచినప్పటి నుంచి సాయంత్రం వరకు కొందరు బయటి వ్యక్తులు అక్కడే తిష్టవేసి, వివిధ పనుల కోసం వచ్చే ప్రజలతో సంప్రదింపులు జరుపుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రజల అవసరాలే పెట్టుబడి..

భూ సమస్యలు, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూ రికార్డుల మార్పులు, వారసత్వం తదితర రెవెన్యూ సేవల కోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తుంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే ప్రక్రియలపై పూర్తి అవగాహన లేని ప్రజలను కొందరు మధ్యవర్తులు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. 'మీ పని త్వరగా పూర్తిచేస్తాం.. అధికారులతో మాట్లాడి పని చేయిస్తాం' అంటూ నమ్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు.

### కార్యాలయంలోనే తిష్ట.. అధికారులకు తెలియదా.?

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన కార్యాలయంలో బయటి వ్యక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వేచ్ఛగా తిరుగుతుండటంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దళారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు కార్యాలయంలో తిరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోజంతా కార్యాలయంలో ఉండే అధికారులు, సిబ్బంది కంటికి ఈ వ్యవహారం కనిపించకపోవడం ఎలా సాధ్యమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### కలెక్టర్ స్థాయి విచారణకు డిమాండ్

బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో దళారుల జోక్యంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైతే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, కార్యాలయంలో అనధికారికంగా తిరుగుతున్న వ్యక్తులపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయం ప్రజలకు సేవలందించే వేదికగా ఉండాలే తప్ప మధ్యవర్తులకు అడ్డాగా మారకూడదని స్పష్టం చేస్తున్నారు. ఆరోపణలపై అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని వెల్లడించడంతో పాటు దళారుల వ్యవహారానికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



## పరకాల సీటు నాదే..
## రేవూరితో ఇప్పుడే రాజీనామా చేయించండి

- మా దయతోనే ప్రకాశ్ రెడ్డి గెలిచారు.. ఆ మేలు సీఎం మరిచారా.?
- రెండేళ్ల తర్వాత ఎన్నికల దాకా ఎందుకు.. ఇప్పుడే సవాల్ స్వీకరించండి
- సీఎం వచ్చి ప్రచారం చేసినా వచ్చే ఎన్నికల్లో రేవూరి గెలుపు కష్టం
- కార్యకర్తల కోసం ప్రాణాలైనా ఇస్తాం.. ఎవరికీ భయపడను: కొండా సుస్మిత

**ప్రజా వాయిస్, హన్మకొండ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కొండా సురేఖ, కొండా మురళి దంపతుల కుమార్తె కొండా సుస్మిత పటేల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తమ సహకారంతోనే విజయం సాధించారని, గతంలో తాము చేసిన మేలును సీఎం మరిచిపోవద్దని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలిచే పరిస్థితి లేదని, ధైర్యం ఉంటే ఇప్పుడే ఎమ్మెల్యేతో రాజీనామా చేయించి ప్రజల్లోకి రావాలని సవాల్ విసిరారు.ఎన్నికలకు ఇంకా రెండేళ్లు ఉన్నాయి.. అప్పటి వరకు ఎందుకు రేవూరి ప్రకాశ్‌రెడ్డితో ఇప్పుడే రాజీనామా చేయించండి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా వచ్చి ప్రచారం చేసినా వచ్చే ఎన్నికల్లో రేవూరి గెలవడం కష్టం అని సుస్మిత స్పష్టం చేశారు. పరకాల నియోజకవర్గంతో రేవూరికి అంతగా పరిచయం లేదని, ప్రజలకు కూడా ఆయన పెద్దగా తెలియదని వ్యాఖ్యానించారు.తాము పదవుల కోసం కాకుండా ప్రజల కోసం, కార్యకర్తల కోసం పనిచేస్తున్నామని సుస్మిత అన్నారు. కార్యకర్తల కోసం ప్రాణాలైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.నేను ఎవరికీ భయపడను.. చావుకు కూడా భయపడను. నమ్మకద్రోహాన్ని మాత్రం సహించను అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రి హోదాలో ఉన్నంత మాత్రాన నేల విడిచి సాము చేయొద్దని రేవంత్‌రెడ్డికి సుస్మిత సూచించారు. గతంలో తమ కుటుంబం చేసిన సహాయాన్ని, రాజకీయంగా అందించిన మద్దతును మరిచిపోవద్దన్నారు. రాజకీయాల్లో నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, తమ కుటుంబం చేసిన మేలును గుర్తుంచుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసుల పంజా

- కోదాడ నుంచి జగ్గయ్యపేటకు తరలిస్తున్న 8 క్వింటాళ్లు పట్టివేత
- గుజరాత్ బాటలో 31 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం
- ఒకే వ్యవహారంలో డ్రైవర్ , క్లీనర్ , యజమానితో సహా నలుగురు అరెస్ట్
- అక్రమ రవాణా వెనుక అసలు సూత్రధారులపై పోలీసుల ఆరా





**ప్రజా వాయిస్,కోదాడ:** పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారుతోంది. ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ముఠాలపై కోదాడ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. వరుస దాడులతో అక్రమ రవాణాదారులకు షాక్ ఇస్తున్నారు. తాజాగా కోదాడ నుంచి జగ్గయ్యపేటకు తరలిస్తున్న 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం తెల్లవారుజామున దుర్గాపురం వద్ద పోలీసులు పట్టుకున్నారు.కారులో కదలడానికి కూడా వీలులేని విధంగా బియ్యం బస్తాలను కుక్కి తరలిస్తుండటంతో అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి తదుపరి చర్యలకు ఉపక్రమించారు.

### గుజరాత్ బాట పట్టిన 31 టన్నులు

ఇదే సమయంలో మరో భారీ అక్రమ రవాణాను కోదాడ రూరల్ పోలీసులు ఛేదించారు. లింగాల గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గుజరాత్‌కు తరలిస్తున్న 31 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 15న రాత్రి నల్లబండగూడెం శివారులోని రామాపురం క్రాస్‌రోడ్ చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నారు. లారీలో సుమారు 600 ప్లాస్టిక్ బస్తాల్లో బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు.

### నలుగురు కోర్టుకు..

ఈ వ్యవహారంలో లారీ డ్రైవర్, క్లీనర్, లారీ యజమానితో పాటు అక్రమ రవాణాకు సహకరించిన మరో వ్యక్తిని కలిపి నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలిస్తున్నారు? దీని వెనుక ఎవరి హస్తం ఉంది? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

### దళారులపై డేగకన్ను

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. బియ్యాన్ని సేకరించే వారు, రవాణా చేసే వారు, ఇతర రాష్ట్రాలకు తరలించే ముఠాల మధ్య ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. వరుస పట్టివేతలతో కోదాడలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాదారుల్లో గుబులు మొదలైంది.




## అక్రమాలకు చరమగీతం

- అక్రమ స్మశాన వాటిక, స్నానపు గదుల తొలగింపు
- జీహెచ్ ఎంసీ, రెవెన్యూ అధికారుల సంయుక్త చర్యలు
- కాలనీలకు చేరువగా దహన సంస్కారాలతో భయాందోళనలు
- ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని ప్రజల డిమాండ్

**ప్రజా వాయిస్, హైదరాబాద్,ఘట్కేసర్:** ఇస్మాయిల్‌ఖాన్‌గూడ గ్రామ పరిధిలోని వసంత వ్యాలీ కాలనీలో అక్రమ స్మశాన వాటికకు అధికారులు చెక్ పెట్టారు. సర్వే నంబర్లు 71, 75లోని మిగులు భూమిలో నిర్మించిన అక్రమ స్మశాన వాటిక, స్నానపు గదులను జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు తొలగించారు. దీంతో వసంత వ్యాలీ, గోకులం నగర్, వెంకటేశ్వర నగర్, జయనగర్ కాలనీలవాసులు హర్షం వ్యక్తం చేశారు.గతేడాది మే 21 నుంచి కాలనీలకు సమీపంలో అక్రమంగా దహన సంస్కారాలు నిర్వహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కాలనీవాసులు తెలిపారు. చిన్నారుల్లో భయాందోళనలు నెలకొనడంతో పాటు కొందరు అనారోగ్యానికి గురయ్యారని పేర్కొన్నారు. దీనిపై పలుమార్లు రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేశారు.ఫిర్యాదులపై రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే నిర్వహించి భూముల వివరాలను పరిశీలించారు. ఇస్మాయిల్‌ఖాన్‌గూడ పరిధిలోని సర్వే నంబర్ 46/1లో 7 ఎకరాల 9 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు, మరో 6 గుంటల భూమికి గిఫ్ట్ డీడ్ ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో గుర్తించారు. ఈ క్రమంలో 2025లో ఏర్పాటు చేసిన అక్రమ వైకుంఠధామం బోర్డును తొలగించడంతో పాటు స్నానపు గదులను అధికారులు తొలగించారు. తాజాగా స్మశాన వాటికకు సంబంధించిన నిర్మాణాలను సైతం తొలగించారు.

పార్కుగా మార్చాలని డిమాండ్

గులు భూమిలో ఇకపై ఎలాంటి ఆక్రమణలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఖాళీగా ఉన్న స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులను విజ్ఞప్తి చేశారు.

## మెదక్ లో రోడ్ ఎక్కి విద్యార్థుల నిరసన

**ప్రజా వాయిస్,మెదక్** మెదక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాలిటెక్నిక్‌లను‌షక్తి పరిధిలోకి తీసుకురావాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం నాడు ఆందోళన చేపట్టారు. ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పాలిటెక్నిక్ విద్యా ప్రత్యేకతను కాపాడాలని ప్రభుత్వా నిర్ణయాన్ని పునః పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ కార్యకర్తలు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు



## ప్రభుత్వ డ్యూటీనా..
## సొంత హాస్పిటల్‌లో సేవలా?

- చిన్నపిల్లల వైద్యుడి వ్యవహారంపై ప్రశ్నలు
- పుష్ప హాస్పిటల్ లోనే ఎక్కువ సమయం?

**ప్రజా వాయిస్, మెదక్**...ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తికే పుష్ప హాస్పిటల్‌కు యాజమాన్య సంబంధం ఉందని, అక్కడ కూడా వైద్యం అందిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించే సమయంలోనే సొంత ప్రైవేట్ హాస్పిటల్‌లోనూ వైద్యం ఎలా అందిస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పుష్ప హాస్పిటల్ వద్ద తరచూ పేషెంట్లు కనిపిస్తుండటంతో.. ప్రభుత్వ ఆస్పత్రి కంటే సొంత హాస్పిటల్‌లోనే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వ ఆస్పత్రి డ్యూటీ, మరోవైపు ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం—రెండు చోట్ల విధులు ఎలా సాధ్యమవుతున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఈ ఆరోపణలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ జరిపి, డాక్టర్ డ్యూటీ సమయాలు, హాజరు రికార్డులు, ప్రైవేట్ ప్రాక్టీస్‌కు సంబంధించిన నిబంధనలు పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు



## జల సిరి పనులు..
## చేయూత పింఛన్లపై సమీక్ష

- నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి: ఎంపీడీవో క్రాంతి కుమార్
- జల సిరి పనులను వేగవంతం చేసి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలి
- అర్హులైన లబ్ధిదారుల ప్రతిపాదనల ప్రక్రియను వేగవంతం చేయాలి

**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:** శంకరంపేట-ఏ మండల పరిషత్ కార్యాలయంలో జల సిరి పనులు, చేయూత పింఛన్ల పురోగతిపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. మండల పరిధిలో VB-GRAMG కింద చేపడుతున్న జల సిరి పనులను వేగవంతం చేయడంతో పాటు చేయూత పింఛన్లకు సంబంధించిన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా ప్రతి గ్రామపంచాయతీలో జల సిరి పనులను వేగంగా ప్రారంభించి లక్ష్యాలను సాధించేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అర్హులైన వారికి చేయూత అందేలా చర్యలుచేయూత పింఛన్లకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల ప్రతిపాదనలను సక్రమంగా సేకరించాలని అధికారులు సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించి ప్రక్రియను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు.జల సిరి పనులు, చేయూత పింఛన్ల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో క్రాంతి కుమార్ సూచించారు.సమావేశంలో ఎంపీడీవో క్రాంతి కుమార్, ఎంపీవో జాకీర్ హుస్సేన్, ఏపీవో సంతోష్ కుమార్, ఈసీ నవాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.



## బస్టాప్ ఏదీ.. ప్రయాణికుల అవస్థలేంటి..?

- కేసారంలో కనీస వసతులకు నోచుకోని బస్టాప్
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ప్రయాణికుల పాట్లు
- 2,500 జనాభా.. అయినా పట్టించుకోని అధికారులు
- షెడ్ , బెంచీలు ఏర్పాటు చేయాలని గ్రామస్తుల డిమాండ్



**ప్రజావాయిస్,మోమిన్‌పేట్:** బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులకు నిలువ నీడ లేదు.. కూర్చునేందుకు బెంచీలు లేవు.. ఎండొచ్చినా.. వానొచ్చినా రోడ్డుపైనే నిలబడాల్సిందే. ఇదీ మోమిన్‌పేట్ మండలం కేసారం గ్రామంలోని బస్టాప్ దుస్థితి. సుమారు 2,500 జనాభా ఉన్న ఈ గ్రామంలో ప్రయాణికుల కనీస అవసరాలను కూడా పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### వానొస్తే తడిసిపోవాల్సిందే..

కేసారం నుంచి వికారాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, తాండూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు, మహిళలు, వృద్ధులు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. బస్టాప్‌లో షెడ్ లేకపోవడంతో ఎండలో నిలబడటం.. వర్షం పడితే తడుస్తూ బస్సు కోసం ఎదురుచూడటం ప్రయాణికులకు నిత్యకృత్యంగా మారింది.

### పట్టించుకునేదెవరు..?

ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు బస్టాప్ దుస్థితిపై దృష్టి సారించకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే నాయకులు.. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ఈ సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

### తక్షణమే బస్టాప్ నిర్మించాలి

వృద్ధులు, మహిళలు, చిన్నారులు, రోగులు ఇబ్బందులు పడకుండా వెంటనే షెడ్, బెంచీలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కేసారంలో సౌకర్యాలతో కూడిన నూతన బస్టాప్ నిర్మించి ప్రయాణికుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఓటర్ల జాబితాపై బీజేపీ కసరత్తు

- శంషాబాద్ లో ఎస్ఐఆర్ రెండో దశపై అసెంబ్లీ కార్యశాల
- అల్కా సింగ్ గురజార్ కు తోకల శ్రీనివాస్ రెడ్డి ఘన స్వాగతం
- నాయకులు, కార్యకర్తలకు సవరణ ప్రక్రియపై దిశానిర్దేశం

**ప్రజా వాయిస్, శంషాబాద్:** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ రెండో దశపై అసెంబ్లీ కార్యశాల నిర్వహించారు. శంషాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి రాజస్థాన్ రాజ్యసభ సభ్యురాలు అల్కా సింగ్ గురజార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి అల్కా సింగ్ గురజార్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎంపీ మర్రి శశిధర్ రెడ్డిని సైతం సాదరంగా ఆహ్వానించారు.నియోజకవర్గ నాయకులతో కలిసి వారు కార్యశాలలో పాల్గొన్నారు.ఎస్ఐఆర్ రెండో దశలో చేపట్టాల్సిన చర్యలు, ఓటర్ల జాబితా సవరణ విధానం, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై కార్యశాలలో చర్చించారు. ఓటర్ల జాబితాలో తప్పులు, అవకతవకలకు తావులేకుండా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరంపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని (SIR) రెండో దశకు సంబంధించిన అంశాలపై చర్చించారు.




# వ్యక్తి బలవన్మరణం!

**- వికారాబాద్ పట్టణం ఆలంపల్లి లో ఘటన**
**- నా చావుకు కారణం అడ్వకేట్ అంటూ సూసైడ్ నోట్!**

**ప్రజావాయిస్/వికారాబాద్:**
మానసిక క్షోభతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి ఆలంపల్లి లో నివాసం ఉంటున్న మృతుడు చంద్రశేఖర్ రాసిన సూసైడ్ నోట్ అందరి చేత కంటతడి పెట్టిస్తుంది.

**అయితే ఆ సూసైడ్ నోట్ లో ఏముంది?**
మల్లేష్ అన్న నాగమణి వదిన, కన్నా,సోనూ నన్ను క్షమించండి,కన్నా,సోనూ..నేను మీతో ఉండాలని, మీకు అన్ని కొనివ్వాలని,మిమ్మల్ని మంచిగా చూసుకోవాలని ఎంతగానో అనుకున్నాను.కానీ నేను చెడు దారిలో నడిచాను.కొంచెం కొంచెం పోయి అది ఎంతగానో అయ్యింది. నా శక్తి చాలడం లేదు.అందుకే నేను చనిపోతున్నా.నాకు అప్పులు ఇచ్చిన వారు కూడా నన్ను క్షమించండి.నేను చేసిన అప్పులకు నా కుటుంబ సభ్యులకు సంబంధం లేదు.నా కుటుంబ సభ్యులను వేధించినట్లయితే వారే నా చావుకు కారణం.నా యొక్క చావుకు ముఖ్య కారణం గౌరీ శంకర్ అడ్వకేట్.ఇతని ద్వారా నేను చాలా క్షోభ పడ్డాను.ఇతడు నా ఇంటిని తప్పుడు సంతకాల పోర్జరితో కోర్టును మోసం చేసి నా ఇంటిని సొంతం చేసుకున్నాడు.కమలానగర్ కు చెందిన గౌరీ శంకర్ (లాయర్) 10 లక్షల రూపాయలు వైన్స్ టెండర్ కోసం ఇచ్చి అవి ఖర్చైయి పోయాక,నేను నీకు మిత్తికి ఇచ్చిన అని నా దగ్గర ఎంతగానో మిత్తి తీసుకున్నాడు.ప్రతి నెల 40 వేల చొప్పున 20 నెలలు



వడ్డీ ఇచ్చాను.నీలాద్రి చిట్ ఫండ్ చిట్టి లేపి అతనికే ఇచ్చాను.ఆది కూడా అతడే షూరిటీ ఇచ్చి లేపినాడు. ఆ తరువాత అది కోర్టు కేసు కూడా అయింది. నా యొక్క చావుకు ముఖ్య కారణం గౌరీ శంకర్. కనుక ఎస్పి గారు తడి పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను.నోట్ చివరలో తాను పనిచేసిన బార్ యాజమాన్యానికి,అతడితో పాటు పనిచేసే మిత్రులను క్షమించండి అని రాసి "మీరు నాకు పెట్టిన పేరు చంటి" లిఇట్లు శేఖర్లి అని సూసైడ్ నోట్ లో రాసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.అయితే కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

## ఎఫ్‌సీఐ గోదాముల్లో స్థలం కేటాయించాలి..
# పాత బియ్యాన్ని వెంటనే తరలించాలి

**ఎఫ్‌సీఐ ఉన్నతాధికారిని కలిసిన ఉమ్మడి జిల్లా రైస్ మిల్లర్ల ప్రతినిధులు.**
**సెప్టెంబర్‌లో పాత బియ్యాన్ని తరలిస్తాం..**
**కొత్త బియ్యానికి గోదాముల్లో స్థలం కల్పిస్తాం**
**- అనూజ్ త్యాగి**

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా:**
ఎఫ్‌సీఐ ఉన్నతాధికారి అనూజ్ త్యాగిని బుధవారం హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా రైస్ మిల్లర్ల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి, మిల్లర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మాట్లాడుతూ.....ఎఫ్‌సీఐ గోదాముల్లో కొత్తగా డెలివరీ చేయాల్సిన బియ్యాన్ని నిల్వ చేసేందుకు తగినంత స్థలం లేకపోవడంతో మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే గోదాముల్లో నిల్వ ఉన్న పాత బియ్యాన్ని సకాలంలో తరలించకపోవడంతో కొత్త బియ్యం నిల్వ చేయడానికి అవకాశం లేకుండా పోతోందన్నారు. "పాత బియ్యాన్ని వెంటనే తరలించి, కొత్త బియ్యానికి గోదాముల్లో స్థలం కల్పించాలి. మిల్లర్లపై ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలి"అని బాదం ప్రవీణ్ కోరారు.మిల్లర్ల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి జిల్లా ప్రతినిధులంతా హైదరాబాద్‌కు వెళ్లి ఎఫ్‌సీఐ ఉన్నతాధికారిని కలిసి సమస్యలను వివరించినట్లు తెలిపారు. పాత బియ్యాన్ని తరలించడంతో పాటు కొత్త బియ్యం నిల్వకు గోదాముల్లో స్థలం కేటాయించాలని కోరినట్లు చెప్పారు. మిల్లర్ల విజ్ఞప్తిపై అనూజ్ త్యాగి సానుకూలంగా స్పందిస్తూ సెప్టెంబర్ నెలలో పాత బియ్యాన్ని తరలించే చర్యలు చేపట్టడంతో పాటు కొత్త



బియ్యం నిల్వకు గోదాముల్లో స్థలం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బాదం ప్రవీణ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బాదం ప్రవీణ్, కార్యదర్శి సహోదర రెడ్డి, వరంగల్ జిల్లా కార్యదర్శి బూరెల సత్యనారాయణ, కోశాధికారి ఇరుకు కోటేశ్వరరావు, మహబూబాబాద్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, సీనియర్ రైస్ మిల్లర్ యుగంధర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: బిజెపి

**మహిళలకు, వికలాంగులు, వితంతువులకు హామీ ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని వెంటనే అమలు చేయాలి**
**దేవాదాయ భూములను సర్వే చేయించాలి**
**మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని నియమించాలి**
**గోపాల్ దిన్నె రిజర్వాయర్ నుంచి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి**
**శ్రీశైలం నిర్వాసితులకు 98 జీవ ప్రకారం ఉద్యోగాలు కల్పించాలి**
**బీజేపీ నాయకుల డిమాండ్**



**ప్రజా వాయిస్.. వనపర్తి**
వనపర్తి జిల్లాచిన్నంబావి మండల పరిధిలోని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కురువ చిన్నమల్లయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, సత్యనారాయణ విమర్శించారు. బుధవారం చిన్నంబావి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.మహిళలు, వికలాంగులు, వితంతువులకు హామీ ఇచ్చిన ఆర్థిక సాయాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేవాదాయ భూముల సర్వే చేపట్టడంతో పాటు మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి, మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కోరారు. గోపాల్‌దిన్నె రిజర్వాయర్ నుంచి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.శ్రీశైలం నిర్వాసితులకు 98 జీవో ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.

# బాలికల భద్రతపై అవగాహన

**- మహిళల భద్రతే ప్రభుత్వ లక్ష్యం**
**- మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ**

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :**
బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ అందోల్‌లో రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో -- బేటీ పడావో (దీదీపూ) కార్యక్రమంలో భాగంగా బుధవారం అందోల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, బాలికల భద్రత మరియు సాధికారతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ ఆడపిల్ల పుట్టుకను గౌరవించడంతో పాటు ప్రతి బాలికకు నాణ్యమైన విద్య అందించడం, ఆమె ప్రతిభను ప్రోత్సహించడం, స్వయం సాధికారత సాధించేలా చేయడం సమాజం మొత్తం బాధ్యత అని తెలిపారు. విద్య ద్వారా బాలికలు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడంతో పాటు ఉన్నతమైన కెరీర్ లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థినులు తమ ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా ఉన్నత విద్య, ఉపాధి మరియు వివిధ వృత్తి అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు.కెరీర్ గోల్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ, చిన్న వయస్సు నుంచే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, సమయపాలన, క్రమశిక్షణ మరియు నిరంతర కృషితో వాటిని సాధించాలని అధికారులు సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, తమకు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.బాలికల భద్రత మరియు రక్షణపై మాట్లాడుతూ, విద్యార్థినులు తమ చుట్టూ ఉన్న పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అసౌకర్యం లేదా ప్రమాదకర పరిస్థితి ఎదురైనప్పుడు నమ్మకమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా సేఫ్ టచ్ -- అన్‌సేఫ్ టచ్పై విద్యార్థినులకు అవగాహన కల్పించి, తమ శరీరానికి సంబంధించిన వ్యక్తిగత హద్దులను తెలుసుకోవడం, అనుచిత స్పర్శను గుర్తించడం మరియు అలాంటి పరిస్థితుల్లో వెంటనే స్పందించడం వంటి అంశాలను వివరించారు. అదేవిధంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతపై అధికారులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని, పాస్‌వర్డ్‌లు, ఫ్యూలు, ఫోటోలు మరియు ఇతర వ్యక్తిగత వివరాలను ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు, తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడం, వ్యక్తిగత వివరాలను పంచుకోవడం వంటి వాటికి దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. బాలికల ఆరోగ్యానికి సమతుల్యమైన పోషకాహారం ఎంతో ముఖ్యమని, రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, ధాన్యాలు, పాలు మరియు ఇతర పోషక పదార్థాలను తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా రక్తహీనతను నివారించేందుకు ఐరన్ మరియు ఇతర పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలని, తగినంత నీరు తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం మరియు ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్ బ్యాంకు కింద మొత్తం 3,000 శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు. శానిటరీ ప్యాడ్ల సరైన వినియోగం, భద్రపరిచే విధానం, వినియోగం అనంతరం పరిశుభ్రంగా మరియు సురక్షితంగా పారవేసే విధానంపై అవగాహన కల్పించారు. బేటీ బచావో -- బేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, రక్షణ మరియు సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి, ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాలను సాధించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, సీడీపీఓ మాధులిక, ఎంఆర్‌వో మధుకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎంఈఓ కృష్ణ, ఎస్ఓ జ్యోతి, ఇన్‌చార్జి ఎస్ఓ సుకన్య, మెడికల్ ఆఫీసర్ శంకర్, జిల్లా సమన్వయకర్త పల్లవి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎస్ఐ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జెండర్ స్పెషలిస్ట్, విద్యార్థినులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## సమాజంలో ఫొటోగ్రాఫర్ల పాత్ర అభినందనీయం: చిన్నకోడూరు ఎస్సై చంద్రమోహన్



**ప్రజా వాయిస్: చిన్న కోదూర్**
సమాజంలో ఫొటోగ్రాఫర్లు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని చిన్నకోడూరు సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) చంద్రమోహన్ కొనియాడారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం చిన్నకోడూరు మండల కేంద్రంలో స్థానిక ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై చంద్రమోహన్ హాజరై, కేక్ కట్ చేసి ఫొటోగ్రాఫర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మానవ జీవితంలో మరుపురాని మధుర క్షణాలను, అరుదైన ఘట్టాలను ఫ్రేమ్ కట్టి తరతరాలకు అందించే గొప్ప కళ ఫొటోగ్రఫీ అని ప్రశంసించారు. వార్తలకు జీవం పోస్తూ, సమాజంలోని సమస్యలను వెలుగులోకి తెచ్చి ప్రజాచైతన్యానికి దోహదపడటంలో ఫొటోగ్రాఫర్ల శ్రమ ఎంతో దాగి ఉందన్నారు. పోలీస్ విధి నిర్వహణలో, శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నేర పరిశోధన విభాగాల్లో ఫొటోగ్రఫీ అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఆయన గుర్తుచేశారు.మారుతున్న ఆధునిక డిజిటల్ యుగానికి అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు నూతన సాంకేతిక మెళకువలను పెంపొందించుకుంటూ వృత్తిలో మరింత రాణించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పిట్ల రవీందర్, దాసరి చంద్రం, కొర్రి శ్రీనివాస్, గౌరిశెట్టి శివ, తాళ్లపల్లి స్వామి, బండి కనకయ్య, నాయిని శ్రీనివాస్, శ్రీను, కటికం రవి, అక్కు కృష్ణ, అస్రప్, అనిల్, బాబు తదితర సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## సిద్దిపేటలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు..ధర్నాలు, డీజేలపై నిషేధాజ్ఞలు జారీ చేసిన సీపీ

**ప్రజా వాయిస్ : సిద్దిపేట**
సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు గానూ సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ ఒక ప్రకటనలో తెలిపారు.తేది 21-08-2026 ఉదయం 06:00 గంటల నుండి 05-09-2026 ఉదయం 06:00 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు మరియు సమావేశాలు నిర్వహించకూడదని సీపీ స్పష్టం చేశారు. అత్యవసరంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తే సంబంధిత ఏసిపి (రూజూ) ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. బంద్‌ల పేరిట బలవంతంగా సంస్థలు, కార్యాలయాలు మూసివేయించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు మరియు విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా శబ్ద కాలుష్యం నుండి కాపాడేందుకు భారీ సౌండ్లతో కూడిన డీజేల వినియోగంపై నిషేధాజ్ఞలు విధించారు. మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అనుకుంటే సంబంధిత డివిజన్ ఏసిపి అనుమతి పొందాలని సూచించారు.పోలీస్ ఉత్తర్వులను ఉల్లంఘించి ధర్నాలు చేసినా, డీజేలు నిర్వహించినా వారిపై బిఎన్ఎస్ (దీచీూ) సెక్షన్ 223తో పాటు సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ రష్మీ పెరుమాళ్ హెచ్చరించారు.



## తాళం వేసిన ఇళ్లే టార్గెట్.. అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్!

**తెలంగాణ, కర్ణాటకలో 100కుపైగా కేసులు..**
**47 గ్రాముల బంగారం, 210 గ్రాముల వెండి స్వాధీనం**



**ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరో చీఫ్**
తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నిందితుడు సయ్యద్ హమీద్‌ను జనగామ పోలీసులు అరెస్ట్ చేశారు. పెంబర్తి క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా పట్టుబడ్డ నిందితుడిని విచారించగా పలు చోరీల వివరాలు వెలుగులోకి వచ్చాయి.జనగామ, బచ్చన్నపేట, చేర్యాల ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 100కుపైగా కేసులు ఉన్నట్లు వెల్లడించారు. అతని వద్ద నుంచి 47 గ్రాముల బంగారం, 210 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిపై కేసు నమోదు చేసి మరిన్ని చోరీల వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ముబారస్‌పూర్ అభివృద్ధికి ఎంపీ రఘునందన్ హామీ

- ఎంపీ ల్యాడ్స్ నిధులతో అభివృద్ధి పనులకు భరోసా
- హైస్కూల్‌కు ప్రహరీ.. అంగన్‌వాడీలకు వసతులు
- 24 గంటల త్రీఫేజ్ విద్యుత్.. కూడళ్లలో ఐమాక్స్ లైట్లకు హామీ



**ప్రజావాయిస్, దౌల్తాబాద్:**
ముబారస్‌పూర్ గ్రామ సమగ్రాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులకు సహకరిస్తానని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు హామీ ఇచ్చారు. బుధవారం గ్రామ సర్పంచ్ కానుగుల విజయస్వామి ఎంపీని కలిసి గ్రామ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గ్రామ ప్రభుత్వ హైస్కూల్‌కు ప్రహరీ నిర్మాణం, రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు వసతులు, 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ సరఫరా, ప్రధాన కూడళ్లలో ఐమాక్స్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు. స్పందించిన ఎంపీ.. ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యమిస్తూ ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి తగిన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ సానుకూల స్పందనపై సర్పంచ్ విజయస్వామి హర్షం వ్యక్తం చేస్తూ గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు

## కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను నిరసిస్తూ బిఆర్ఎస్ నాయకులు మహా ధర్నా

### కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు బీమా పథకాలను రద్దు చెయ్యోదు

### బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కు వినతి




**ప్రజా వాయిస్/చర్ల:**
కళ్యాణ లక్ష్మి,షాదీముబారక్,రైతుభీమా పథకాలను తీసేయాలని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను నిరసిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు పిలుపు మేరకు భద్రాచలం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రావులపల్లి రాంప్రసాద్, చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో చర్ల మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించారు అనంతరం చర్ల తహసిల్దార్ శ్రీనివాసరావు కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా రావులపల్లి రాంప్రసాద్, దొడ్డి తాతారావు మాట్లాడుతూ పేద ఆడబిడ్డల వివాహాలకు, ఆర్థిక భరోసా కల్పిస్తున్న రైతు బీమా పథకాలను నిరంతరం కొనసాగించాలని, పెండింగ్ లో ఉన్న లబ్ధిదారులకు తక్షణమే చెక్కులు అందించాలని పేదల సంక్షేమ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు ప్రతి ఆడబిడ్డలకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో మండల కో కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు సోయం రాజారావు, పార్టీ సీనియర్ నాయకులు తోటపల్లి మాధవరావు, పెద్ద బుజ్జి, గొర్ల రాజబాబు,జోగిరాజు, రాము, దినసరపు భాస్కర్ రెడ్డి,పంజా రాజు,కాకి అనిల్, ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధుల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మిరుదొడ్డిలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**ప్రజా వాయిస్ మీరుదొడ్డి**
మిరుదొడ్డి మండల కేంద్రంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంఘం ఆవరణలో జెండాను ఆవిష్కరించిన అనంతరం అధ్యక్షుడు గోపాల్ మాట్లాడారు. సమాజంలో మంచి చెడులను చూపించడంలో, గ్రామీణ సమస్యలను వెలుగులోకి తేవడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సాంకేతికత పెరిగినా కెమెరా వెనుక ఉన్న మనిషి ఆలోచనకే విలువ ఉంటుందని, యువత ఫోటోగ్రఫీని వృత్తిగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు భాష, ప్రసాద్, నరసయ్య, ఆంజనేయులు, సంతోష్ చారి, రాజేందర్, యాదగిరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# పెబ్బేరులో ఘనంగా ప్రపంచఫోటోగ్రఫీ దినోత్సవం

### సీనియర్ ఫోటో గ్రాఫర్లను సన్మానించిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**ప్రజా వాయిస్.. వనపర్తి**
సమాజంలో జరిగే విభిన్న సంఘటనలను, మధుర జ్ఞాపకాలను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించే మహత్తర శక్తి ఫోటోగ్రఫీకి మాత్రమే ఉందని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సుభాష్ చౌరస్తాలో లైఫ్ స్టైల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఫోటోగ్రఫీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సృజనాత్మకతకు నిదర్శనం మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రఫీ రంగంలో ఎన్నో అధునాతన మార్పులు, డిజిటల్ సాంకేతికత అందుబాటులోకి వచ్చాయని చైర్మన్ తెలిపారు. కెమెరా వెనుక ఉండే ఫోటోగ్రాఫర్ల శ్రమ, వారి సృజనాత్మకత ఎంతో అభినందనీయమని కొనియాడారు. కంటికి కనిపించే ప్రతి దృశ్యాన్ని కళాత్మకంగా కంటిపాపలా చిత్రీకరించి సమాజానికి అందించే పాత్ర వారిదేనని కొనియాడారు.

**సీనియర్లకు ఘన సన్మానం**
ఈ సందర్భంగా ఏళ్లుగా ఫోటోగ్రఫీ వృత్తిని నమ్ముకుని సేవలందిస్తున్న లైఫ్ స్టైల్ అసోసియేషన్ అధ్యక్షులు అజంత వెంకటన్న, ప్రీతి రాము, శిల్ప భాస్కర్, శ్రీలక్ష్మి నాగరాములు పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ శాలువాతో



ఘనంగా సన్మానించారు. వారి సేవలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు, లైఫ్ స్టైల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పెద్ద సంఖ్యలో ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.బి

# మంత్రి పొన్నం ప్రభాకర్ 'పల్లె పల్లెకు పొన్నమన్న' పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ కె. హైమావతి




**ప్రజా వాయిస్ సిద్దిపేట జిల్లా**
హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ త్వరలో నిర్వహించబోయే "పల్లె పల్లెకు పొన్నమన్న, పల్లె పల్లెలో ప్రజాపాలన" కార్యక్రమానికి సంబంధించి అన్ని శాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి నిర్వహించిన జూమ్ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీఓలతో ఆమె సమీక్ష జరిపి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామాల్లో నేరుగా ప్రజలను కలిసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరును, స్థానిక సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో సభల నిర్వహణకు టెంట్లు, కుర్చీలు, సౌండ్ సిస్టమ్ తదితర సౌకర్యాలను పక్కాగా ఏర్పాటు చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. సభల్లో ప్రజల నుండి వచ్చే దరఖాస్తులను స్వీకరించి, వాటిని రికార్డు చేస్తూ ఏ స్థాయిలో పరిష్కరించవచ్చో పరిశీలించి ఫైలింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, కొత్త రేషన్ కార్డుల్లో చేర్చిన సభ్యుల వివరాలు, గ్యాస్ సబ్సిడీ, సన్నబియ్యం పంపిణీ, సన్నవడ్లకు బోనస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, వడ్డీ లేని రుణాలు మరియు ఇందిరమ్మ చీరల పంపిణీకి సంబంధించిన పూర్తి సమాచారంతో జాబితాలను సిద్ధం చేసి గ్రామసభల్లో ప్రదర్శించాలని సూచించారు. శాఖల వారీగా మంజూరైన పనులు, వాటి పురోగతిపై ప్రత్యేక సమీక్ష ఉంటుందని, ప్రతి పనికీ ఒక నిర్ణీత గడువు విధించి ఆ సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాల వంటి ప్రాథమిక సమస్యలను ముందస్తుగానే గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు, వారికి అందించే పౌష్టికాహార వివరాలు అధికారుల వద్ద సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా గ్రామసభల్లో వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి ప్రతి గ్రామంలోని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఈ పర్యటన కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించాలి

### కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలి

### నిరుద్యోగ సమస్యపై ఆగస్టు 20న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను జయప్రదం చెయ్యండి

### సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. జబ్బార్

**ప్రజా వాయిస్.. వనపర్తి**
వానాకాలం వరి సాగుకు జూరాల ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. జబ్బార్ డిమాండ్ చేశారు. బుధవారం వీపనగండ్ల మండలంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం మండ్ల కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.డి. జబ్బార్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో జూరాల ప్రాజెక్టు కింద వరి సాగు చేయవద్దని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచిస్తున్నప్పటికీ, ఇప్పటికే పలువురు రైతులు వరి నాట్లు వేస్తున్నారని తెలిపారు. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి వరద నీరు వస్తుండటంతో రైతుల్లో సాగుపై ఆశలు పెరిగాయని అన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు




అందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. చివరి సమయంలో సాగునీటి సమస్య తలెత్తకుండా కర్ణాటక ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సింగోటం నుంచి గోపాల్‌దిన్నె రిజర్వాయర్ వరకు లింక్ కెనాల్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, దీంతో వీపనగండ్ల, చిన్నంబాయి ప్రాంతాల రైతులకు సాగునీటి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎరువులు, పురుగుమందుల ధరలను పెంచుతూ రైతులపై భారాన్ని మోపుతోందని విమర్శించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల సమస్యలపై ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నిరుద్యోగ సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని జబ్బార్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 20న అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాలో నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి డి. బాల్‌రెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు మండ్ల కృష్ణయ్య, రవి ప్రసాద్, శాంతమ్మ, మండల కమిటీ సభ్యులు వీ. కృష్ణయ్య, బాలగౌడ్, సీహెచ్. వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ జీడి సత్యనారాయణ అమర్ రహే.. ఎర్రజెండా నీడలో ముగిసిన జీవన ప్రయాణం

### వారు చనిపోవడం కమ్యూనిస్టు ద వామపక్షాలకు తీరనిలోటు.

### కమ్యూనిస్టు పార్టీ విడిపోయినప్పుడు సిపిఎం ఏర్పాటుకు ఎంతో కృషి చేశాడు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి సత్యనారాయణ పోరాటంలో ముందుంటాడు.

### సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేష్

**ప్రజావాయిస్/పాలకుర్తి**
పాలకుర్తి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ జీడి సత్యనారాయణ అనారోగ్యంతో మృతిచెందగా సిపిఎం ఆధ్వర్యంలో భౌతికాయం మీద రెడ్ క్లాత్ కప్పి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేష్ పాల్గొని మాట్లాడుతూ, పాలకుర్తి గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సత్యనారాయణ పోరాటం లో ముందు వరుసలో ఉండేవారని, విసునూరు రాపాక రామచంద్ర రెడ్డి ఆగడాలను ఎదిరించి దున్నేవాడి కి భూమి దక్కాలని దొరలకు వ్యతిరేకంగా భూమికోసం భుక్తి కోసం దొరల విముక్తి కోసం పోరాటం చేసిన ఐలమ్మ నల్ల నరసింహులు సోమ నరసయ్య తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ చుట్టుపక్క గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ విడిపోయినప్పుడు సిపిఎం ఏర్పాటుకు కృషి చేశాడని వారు తెలిపారు, పాలకుర్తి గ్రామంలో మూడు పర్యాలు సిపిఎం సర్పంచ్, మరియు ఎంపీటీసీ ని గెలిపించడం లో కీలకపాత్ర పోషించారన్నారు, వారు చనిపోవడం కమ్యూనిస్టు వామపక్షాలకు తీరని లోటు అని వారు ఆశించిన ఆశయాల కోసం నేటి కమ్యూనిస్టులు ఐక్య పోరాటాలు చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక ఉద్యమాలపై ఉద్యమించాలన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, మండల కమిటీ సభ్యులు సోమసత్యం, ఏదునూరి మదార్, రాపర్తి కొమురయ్య, చిట్యాల సంధ్యారాణి, ఎల్లయ్య, మల్లరాజు నరేష్,తో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు



# తుంకుంట లో కాంగ్రెస్ పార్టీ కమిటీల పేర్ల సేకరణ సమావేశం

**బీఎల్ఏలకు ఘన సన్మానం..**

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలి:**

**తోటకూర వజ్రేష్ యాదవ్**

**మేడ్చల్, శామీర్ పేట్ / ప్రజా వాయిస్ :** ఏఐసీసీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ సూచనలతో శామీర్ పేట్ 300 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ కమిటీల పేర్ల సేకరణ సమావేశం, బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) సన్మాన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. శామీర్ పేట్ 300 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నక్క సందీప్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నామని



తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, బాధ్యత కల్పించేందుకు పేర్ల సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని వజ్రేష్ యాదవ్ అన్నారు. ముఖ్యంగా మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇందిరమ్మ మహిళా పథకాలు సహా పది ప్రధాన సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో బీఎల్ఏల పాత్ర కీలకమని, ఓటర్లతో నిరంతరం అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా బీఎల్ఏలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేడ్చల్ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మైపాల్ రెడ్డి, హజ్ కమిటీ మెంబర్ ముజీబ్, ఆర్టిఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు.. ప్రజాస్వామ్యానికి విరుద్ధం

**నర్సంపేటకు వెళ్తుంటే అడ్డుకుని అరెస్ట్ చేశారు..**

**40 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చ లేదు**

**కాంగ్రెస్ పాలనలో అవినీతి, దౌర్జన్యాలు పెరిగాయి.. అధికారులపై ఒత్తిళ్లు తగదు**

**మరో రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది..**

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

**ప్రజా వాయిస్,జనగామ:**
నర్సంపేటలో పార్టీ కార్యకర్తలకు ధైర్యం చెప్పేందుకు వెళ్తున్న తనను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం దారుణమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగామ పోలీస్‌స్టేషన్ నుంచి విడుదలైన అనంతరం ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, వరంగల్ రాజకీయాల్లో తనపై చిన్న మచ్చ కూడా లేదని అన్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా తనను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు.నర్సంపేట కార్యకర్తలకు ధైర్యం చెప్పేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. తన అరెస్టుకు నిరసనగా నర్సంపేటలో సంపూర్ణ బంద్ జరిగిందన్నారు. నర్సంపేట అభివృద్ధి







గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నేతలకు లేదని విమర్శించారు. గతంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి హయాంలోనే మెడికల్ కాలేజీ, సాగునీటి సౌకర్యాలు సహా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు.

**బోగస్ మాటలు నమ్మి ఓడిపోయాం**

రేవంత్‌రెడ్డి చెప్పిన బోగస్ మాటలను నమ్మి ఎన్నికల్లో తాము ఓడిపోయామని, అయితే ప్రజలు ఇప్పుడు వాస్తవాలను గమనిస్తున్నారని ఎర్రబెల్లి అన్నారు. ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సైతం రాజకీయ కక్షతో వివాదంగా మార్చడం సరికాదన్నారు.రాష్ట్రంలో అవినీతి, డబ్బు సంచుల రాజకీయాలు, దౌర్జన్యాలు, అధికార దుర్వినియోగాన్ని ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖను అడ్డుపెట్టుకుని పేదల భూముల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. అధికారులు కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లకు లొంగకుండా చట్టం, న్యాయం ప్రకారం పనిచేయాలని సూచించారు.

**ప్రభుత్వాలు మారుతాయి.. గుర్తుంచుకోండి**

అధికారులు ప్రభుత్వాలు మారుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎర్రబెల్లి సూచించారు. అధికార పార్టీ నాయకుల ప్రలోభాలకు లొంగకుండా ప్రజల కోసం పనిచేయాలని కోరారు. మరో రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# శిశు గృహంలో నిర్లక్ష్యంపై న్యాయ సేవాధికార సంస్థ ఆగ్రహం

**బొమ్మలు దాచుకోవడానికి కాదు..**

**పిల్లలు ఆడుకోవడానికి**

**ఆకస్మిక తనిఖీలో సెక్రెటరీ రాధిక..**

**సిబ్బంది తీరుపై తీవ్ర అసంతృప్తి**

**చిన్నారుల అవసరాలు గుర్తించి.. సమయానికి ఆహారం, మెరుగైన వసతులు కల్పించాలి**

**ప్రజావాయిస్/వికారాబాద్:**
వికారాబాద్ పట్టణంలోని శిశు గృహంలో సిబ్బంది నిర్లక్ష్యంపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ రాధిక ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం శిశు గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలు ఏడుస్తున్నా సిబ్బంది పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల సంరక్షణలో నిర్లక్ష్యం సహించేది లేదని స్పష్టం చేశారు.

**బొమ్మలు దాచేస్తారా.?**

శిశు గృహంలో పిల్లలు ఆడుకునేందుకు ఉన్న బొమ్మలను వారికి అందుబాటులో ఉంచకుండా దాచిపెట్టడంపై రాధిక మండిపడ్డారు. బొమ్మలు పిల్లలు ఆడుకోవడానికే తప్ప దాచుకోవడానికి కాదని పేర్కొంటూ వాటిని వెంటనే చిన్నారులకు అందజేశారు. అనంతరం వారితో కొంతసేపు గడిపి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.

**అవసరాలు మనమే గుర్తించాలి**

చిన్నారులు తమకు కలిగే ఇబ్బందులను స్వయంగా చెప్పుకోలేని పరిస్థితిలో ఉంటారని రాధిక తెలిపారు. అందువల్ల వారి అవసరాలను సిబ్బంది ఎప్పటికప్పుడు గుర్తించి తీర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆహారం, వసతులు, సంరక్షణ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు.

**సమయానికి ఆహారం.. పరిశుభ్రత తప్పనిసరి**

పిల్లలకు నిర్ణీత సమయానికి ఆహారం అందించాలని సూచించారు. శిశు గృహం పరిసరాలను పరిశీలించిన ఆమె పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. చిన్నారులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఇదే తరహాలో నిర్లక్ష్యం కొనసాగితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




# రూ"164 కోట్లతో మంథనిలో అభివృద్ధి పనులు

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**ప్రజా వాయిస్ మంథని**
పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , తుమ్మల నాగేశ్వరరావుతో పాటు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.మంథని నియోజకవ ర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఉమ్మడిగా పాల్గొని రూ.164 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంథని బ్రిడ్జి రోడ్డు నుంచి బస్సు డిపో వరకు రూ" 15 కోట్లతో రోడ్డు వెడల్పు డ్రెయిన్, సెంట్రల్ లైటింగ్,పనులను చేపట్టారు. ఈ సంద ర్భంగా నిర్వ హించిన సమావేశంలో మంత్రులు మాట్లా డుతూ...మంథని ప్రాంతాభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిం దన్నారుఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గడిచిన రెండు సంవత్సరాల కాలంలో మంథని నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం



దాదాపు రూ.800 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే నేడు రూ.164 కోట్లతో వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామని తెలిపారు. గోదావరి నదిపై ప్రతి పాదిత బ్రిడ్జి నిర్మాణా నికి అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిందని వివరించారు. ఎన్ని కల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని క్రమంగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు.నేపథ్యంలోనేమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడు తూ, ఉమ్మడి రాష్ట్రం లో మంథని ప్రాంతానికి ఎనలేని సేవలుందించిన దివంగత మాజీ ప్రధాని పీవీ నరసిం హారావు, మాజీ స్పీకర్ శ్రీపాద రావుల సేవలను స్మరించుకు న్నారు. ఈ నియోజ కవర్గ పురోగతికి రూ.800 కోట్ల నిధు లు కేటాయించడం శుభపరిణామమన్నారు. యువతకు ఉపాధి, సాంకేతిక శిక్షణ అవకాశాలను విస్తరించేందుకు మంథనిలో రూ.20 కోట్ల వ్యయంతో న్యాక్ సెంటర్‌ను మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు.

# ప్రభుత్వ వైఫల్యాలపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ధ్వజం



**ప్రజా వాయిస్ దుబ్బాక**
దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తిమ్మాపూర్ గ్రామంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 22–ఏ భూముల సమస్య వల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయని, బ్లాక్‌లిస్టులో ఉన్న రైస్ మిల్లర్లకు ధాన్యం తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని ఆరోపిస్తూ సమగ్ర విచారణకు డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తులపై కాంగ్రెస్ నాయకులే శ్వేతపత్రం అడుగుతున్నారని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.దుబ్బాకలో రోడ్ల దుస్థితిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సవాల్ విసిరిన ఎమ్మెల్యే, గత రెండేళ్లలో నియోజకవర్గంలో ఎక్కడైనా రోడ్ల అభివృద్ధి చేసినట్లు నిరూపిస్తే 24 గంటల్లో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో దుబ్బాక నుంచే మరో ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు.

## పండుగ సాయన్న జయంతికి అధికారిక హోదా

**అక్టోబర్ 22న ప్రభుత్వ ఆధ్వర్యంలో జయంతి నిర్వహణకు జీవో**

**ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలి: సాయి ముదిరాజ్**

**ప్రజా వాయిస్, తోగుట:**
తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతిని అక్టోబర్ 22న అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయడంపై తెలంగాణ ముదిరాజ్ మహాసభ తోగుట మండల అధ్యక్షుడు ఉల్లెంగల సాయి ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నీల మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చేసిన విజ్ఞప్తి మేరకు జీవో వెలువడిందని సాయి ముదిరాజ్ పేర్కొన్నారు. ముదిరాజ్ సంఘ సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ కేటగిరీలోకి మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు.



## శ్రావణ్ గౌడ్ పోరాటం అభినందనీయం..

- మారుపేర్ల సమస్యను పరిష్కరిస్తాం
- సింగరేణి మారుపేర్ల సంఘం అధ్యక్షుడిని పరామర్శించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- 74 గంటల ఆమరణ నిరాహార దీక్షపై ఎంపీ ప్రశంసలు
- బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని యాజమాన్యానికి సూచన

**ప్రజా వాయిస్**
**గోదావరిఖని**
సింగరేణిలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్లు (డిసిగ్నేషన్ మారిన కేసులు) మరియు విజిలెన్స్ కేసుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ?ఈ సమస్యపై ఏకంగా 74 గంటల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ఇటీవల దీక్ష విరమించిన సింగరేణి మారుపేర్ల సంఘం అధ్యక్షుడు లక్కా శ్రావణ్ గౌడ్ నివాసానికి ఎంపీ వంశీకృష్ణ విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బాధితుల హక్కుల కోసం ప్రాణాలకు సైతం తెగించి పోరాడిన శ్రావణ్ గౌడ్‌ను ఎంపీ ప్రత్యేకంగా అభినందించి, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ?అధికారులతో మాట్లాడిన ఎంపీ అనంతరం ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి సుముఖంగా ఉందన్నారు. మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితుల విషయంలో సింగరేణి ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించే దిశగా సానుకూల చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. శ్రావణ్ గౌడ్ కుటుంబ సభ్యులకు ఎంపీ ధైర్యం చెప్పి, ప్రభుత్వం మరియు తన తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్మికులకు, వారి కుటుంబాలకు త్వరలోనే న్యాయం జరిగేలా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, బాధితులు పాల్గొన్నారు.



# డి.టి.యు విద్యా సదస్సును జయప్రదం చేయండి-డీఈఓ రమేష్ కుమార్



**ప్రజ వాయిస్ ఆగస్టు 19 నాగర్ కర్నూల్**
ధర్మ టీచర్స్ యూనిటీ (ఙఖ ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తేదీ 26.08.2026 న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే విద్యా సదస్సును జయప్రదం చేయాలని నాగర్ కర్నూల్ డి.ఇ.ఓ రమేష్ కుమార్ పిలుపునిచ్చారు.విద్య బోధనలు మెరుగుపరచుకోవడానికి, ఉపాధ్యాయులు కూడా తమను తాము మెరుగుపరుచుకోవడానికి ఇటువంటి సదస్సులు, అవగాహన సమావేశాలు ఎంతగానో ఉపయోగపడతాయని డీఈఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, నోడల్ ఆఫీసర్ కురుమయ్య, అకాడమీక్ మానిటరింగ్ ఆఫీసర్ కిరణ్, టీచర్స్ జేఏసీ నాయకులు చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, కో చైర్మన్ రాజారెడ్డి, గుడిపల్లి నిరంజన్ ,ట్రెజరరీ వెంకటయ్య, లక్ష్మణ్ నాయక్, డి.టి.యుగౌరవ అధ్యక్షులు కొంగరి జానయ్య,డిటియు ప్రధాన కార్యదర్శి కూరాకుల ఆంజనేయులు, మధుసూదన్ రెడ్డి, వెంకట్, కార్యవర్గ సభ్యులు ప్రేమ్ కుమార్, వలిగి తిరుపతయ్య, శివకుమార్, జాన్యా నాయక్, రమేష్ కుమార్, లక్ష్మీపతి, వెంకటేష్, లక్ష్మణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చల్లా ధర్మారెడ్డి హౌస్ అరెస్ట్..

## రేవంత్ రెడ్డికి భయమెందుకు? చల్లా ధర్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే.



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
నర్సంపేట బంద్ నేపథ్యంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ప్రజల పక్షాన ప్రశ్నిస్తే నిర్బంధం.. ప్రభుత్వాన్ని నిలదీస్తే హౌస్ అరెస్ట్.. ఇదేనా కాంగ్రెస్ చెప్పుకునే ప్రజా పాలన? అని చల్లా ధర్మారెడ్డి ప్రశ్నించారు.నర్సంపేట ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు పిలుపునిచ్చి నిరసన వ్యక్తం చేస్తుంటే.. ఉద్యమానికి మద్దతు తెలిపే నాయకులను పోలీసులు అడ్డుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు.విగ్రహం తొలగిస్తే చరిత్ర చెరిగిపోదు.. నాయకుడిని నిర్బంధిస్తే ప్రజల గొంతు మూగబోదు" అని చల్లా ధర్మారెడ్డి అన్నారు.ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం ద్వారా ఆయనపై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని చెరిపేయలేరని స్పష్టం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కి జరిగిన అవమానంపై ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని అణచివేయడం ఎవరి తరం కాదన్నారు.నన్ను హౌస్ అరెస్ట్ చేయడం కాదు.. ప్రజాస్వామ్యాన్ని హౌస్ అరెస్ట్ చేయడమే. నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు.. గొంతు నొక్కి ప్రజల ఆగ్రహాన్ని అణచలేరు అని చల్లా ధర్మారెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తన తప్పును సరిదిద్దుకుని పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని, అక్రమ నిర్బంధాలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

## 302 ఐపీసీ కింద జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా

**ప్రజా వాయిస్ ఆగస్టు 19** నాగర్‌కర్నూల్ హత్య కేసులో నిందితులైన ఇద్దరికి నాగర్‌కర్నూల్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. 2016లో నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 323/2016 కేసులో విచారణ పూర్తిచేసిన న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది.కేసు వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం పెద్దాపూర్‌కు చెందిన తొగరి బుడ్డయ్య (40) అతని భార్య తొగరి సువర్ణ (35) నిందితులు. వీరిపై ఐపీసీ 452, 302, 323, 506 సెక్షన్లతో పాటు 34 సెక్షన్ కింద కేసు నమోదైంది. కేసును విచారించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డి. రామకాంత్ నిందితులు నేరం చేసినట్లు నిర్ధారించి.ఐపీసీ 302 సెక్షన్ కింద ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా, 452 సెక్షన్ కింద మూడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా, 323 సెక్షన్ కింద ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారులు ఎస్.ఐ ఎస్. శేఖర్‌రెడ్డి, సీ.ఐ ఎం. రాంబాబు కీలకంగా దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుత నాగర్‌కర్నూల్ సీఐ వై. అశోక్‌రెడ్డి ఎస్ఐ జి. వెంకట్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. కోర్టు కానిస్టేబుళ్లు ఎస్.గుణశేఖర్, వి. నరేష్, ఎండీ ముజీబ్, కోర్టు లైజనింగ్ అధికారి హెచ్.సీ చిన్ని నాయక్ సహకరించారు. ప్రభుత్వ న్యాయవాది ఎండీ అహ్మద్ అలీ ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు ఈ కేసు విషయంలో నిందితులకు శిక్ష పడేలా కృషిచేసిన పోలీస్ ఆఫీసర్స్ అందరికి నాగర్ కర్నూల్ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు ప్రశంసించడం జరిగిందని తెలిపారు జిల్లా పోలీసు అధికారి కార్యాలయం వెలువరించారు

# వనపర్తిలో ఘనంగా ఫోటోగ్రఫీ డే వేడుకలు

**వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ**

**ఫోటోగ్రాఫర్లంతా ఐక్యంగా ముందుకు సాగాలి**

**ప్రజా వాయిస్.. వనపర్తి**
వనపర్తి జిల్లా పట్టణ ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి ఫోటోగ్రాఫర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షురాలు ముంత నిర్మల జెండాను ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాము సమక్షంలో సలహాదారులు రవి, స్వాతి శ్రీను, లక్ష్మి శ్రీను, జెబ్బర్, వెంకటేష్, శేఖర్, సుల్తాన్ తదితరులు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వల్లభ్‌నగర్‌లోని సరోజ్ సూద్ వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రాము మాట్లాడుతూ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఫోటోగ్రాఫర్లంతా ఐకమత్యంగా ఉండటం వల్ల ప్రభుత్వ సహకారంతో యూనియన్ భవన నిర్మాణానికి స్థలం సాధించగలిగామని పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్ర నాయకుల సమక్షంలో పెద్ద ఎత్తున సభ నిర్వహించి ఫోటోగ్రాఫర్ల భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో క్యాషియర్లు బాలు, శ్రీను, ఉపాధ్యక్షుడు యాదగిరి, నిరంజన్, సహాయ కార్యదర్శులు ఈశ్వర్, నజీర్, కుటుంబ భరోసా ఇన్‌చార్జి సూరి, సోషల్ మీడియా ఇన్‌చార్జి శ్యామ్‌లాల్, ప్రధాన కార్యదర్శులు, అసోసియేషన్ సభ్యులు, పట్టణంలోని ఫోటోగ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# వైరాలో అంబరాన్నంటిన ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం!

**వైరా పురవీధుల్లో హోరెత్తిన భారీ బైక్ ర్యాలీ**

**ఆధునిక సాంకేతికతే ఆయుధంగా ఫోటోగ్రాఫర్లు దూసుకుపోవాలి: అసోసియేషన్ అధ్యక్షుడు బట్ట కృష్ణ**

**ఫోటోగ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ప్రభుత్వానికి డిమాండ్**




**ప్రజా వాయిస్ ఖమ్మం:**
ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో, కన్నులపండుగగా సాగాయి. వైరా మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో మండల వ్యాప్తంగా ఉన్న లెన్స్ యోధులు పెద్ద సంఖ్యలో కదం తొక్కారు.కార్యక్రమంలో భాగంగా అసోసియేషన్ అధ్యక్షుడు బట్ట కృష్ణ ఫోటోగ్రఫీ అసోసియేషన్ పతాకాన్ని సగర్వంగా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు, ఆవిష్కర్త లూయిస్ జాక్ మాండే డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు బట్ట కృష్ణ మాట్లాడుతూ.. క్షణాలను శాశ్వత జ్ఞాపకాలుగా మలిచే అద్భుత కళ ఫోటోగ్రఫీ అని కొనియాడారు. మారుతున్న కాలానికి, వేగంగా వస్తున్న డిజిటల్ విప్లవానికి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు నిరంతరం అప్‌డేట్ కావాలని పిలుపునిచ్చారు. ఆధునిక కెమెరాలు, అత్యాధునిక లైటింగ్ మెళకువలు, సరికొత్త డిజిటల్ ఎడిటింగ్ టెక్నాలజీపై పట్టు సాధించి తమ నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలన్నారు.సమాజంలో ప్రతి శుభకార్యానికి ప్రాణం పోసే ఫోటోగ్రాఫర్ల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించవద్దని గళమెత్తారు. రాత్రింబవళ్లు శ్రమించే ఫోటోగ్రాఫర్ల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఫోటోగ్రాఫర్‌కు సబ్సిడీతో కూడిన బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేసి ఆర్థిక భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం అసోసియేషన్ శ్రేణులు వైరా పట్టణంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. ఫోటోగ్రఫీ రంగ విశిష్టతను, ప్రాధాన్యతను చాటుతూ సాగిన ఈ ర్యాలీతో వైరా పురవీధులు హోరెత్తాయి.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎక్కిరాల శ్రీనివాసరావు, వైరా మండల ఫోటోగ్రాఫర్స్ గౌరవ అధ్యక్షులు ఏపూరి రాజారావు, కార్యదర్శి కాకాటి వినోద్ కుమార్, కోశాధికారి తెల్లపుట్ట ప్రసన్నకుమార్, అసోసియేషన్ ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేశారు.

# నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలి

**పర్షిక సతీష్ ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్**

**వెంకటాపురం ప్రజా వాయిస్ :**
వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని వెంకటాపురం మండల తహసిల్దార్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. అనంతరం ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్ మాట్లాడుతూ 5వ షెడ్యూల్డ్ తెగలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిని గుర్తించి రద్దు చేయాలన్నారు . నకిలీ ఎస్టీ ధ్రువీకరణ పత్రాల ద్వారా ఆదివాసులకు ఉద్యోగ పరంగా, రాజకీయంగా ,ఆర్థికంగా అభివృద్ధి పరంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.నకిలీ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా పొందిన ఉద్యోగాలు, విద్యా ప్రవేశాలు, రిజర్వేషన్ ప్రయోజనాలు తదితరాలను నిబంధనల ప్రకారం సమీక్షించాలనీ కోరారు.నకిలీ కుల ధ్రువీకరణ పత్రాల జారీకి సహకరించిన అధికారులపై ధ్వజం మెత్తారు నిజమైన ఆదివాసీ అభ్యర్థుల హక్కులకు అన్యాయం జరగకుండా కుల ధ్రువీకరణ ప్రక్రియను పారదర్శకంగా, కఠినంగా అమలు చేయాలనీ మండిపడ్డారు.ప్రతి ఫిర్యాదును అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో విచారించి, అర్హత లేని ధ్రువీకరణ పత్రాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలను అరికట్టి, నిజమైన ఆదివాసీ యువతకు విద్య, ఉద్యోగం,రాజకీయం మరియు రాజ్యాంగ రిజర్వేషన్ ,హక్కులను రక్షించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల అధ్యక్షుడు తుర్స కృష్ణ బాబు,తాటి రాంబాబు,కేక్కెం శ్యామ్,నాగేష్,కుంజ రమేష్, సంతోష్, బాడిశ నరసింహారావు, కోర్స నరసింహారావు,కోర్స అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ జిల్లాలో కోతుల బెడద..నియంత్రణకు పటిష్ట చర్యలు

**ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రత్యేక కార్యాచరణ....**

**రైతుల పంటలకు రక్షణే లక్ష్యం.. వేగంగా చర్యలు చేపట్టాలి.....**

**కోతులను పట్టి నిర్మల్‌కు తరలింపు.. కుటుంబ నియంత్రణ చర్యలు**

**మున్సిపల్, అటవీ, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేయాలి......**

**అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశాలు.....**

**ప్రజా వాయిస్,మెదక్**
మెదక్ జిల్లాలో రైతులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న కోతుల బెడదను నియంత్రించేందుకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో కోతుల నియంత్రణ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కోతుల బెడద నివారణపై జిల్లా అటవీ అధికారి జోజి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యతో పాటు మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

**రైతుల పంటలను కాపాడా**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రరూపం దాల్చిందన్నారు. పంట పొలాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతో పాటు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు.విద్యార్థులు సైతం కోతుల దాడుల్లో గాయపడిన సందర్భాలు ఉన్నాయని, కోతుల సమస్యపై ప్రజావాణిలో అనేక ఫిర్యాదులు, వినతులు అందుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సమస్యను సాధారణ అంశంగా కాకుండా ప్రజలు, రైతుల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పట్టుకుని నిర్మల్‌కు తరలింపు**

కోతులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలను ముందుగా గుర్తించి, ప్రత్యేక బృందాల ద్వారా వాటిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పట్టుకున్న కోతులను స్థానిక అటవీ శాఖ అధికారులు, ఎఫ్ఆర్ఓల సహకారంతో నిర్మల్ జిల్లాకు తరలించి, అక్కడ కుటుంబ నియంత్రణ ప్రక్రియ చేపట్టి సంతతి పెరగకుండా చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.కోతులను పట్టుకోవడం, తరలించడం తదితర కార్యక్రమాలకు అవసరమైన నిధుల సమీకరణలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహాయ సహకారాలను కూడా తీసుకోవచ్చని సూచించారు.

**ఉద్యమంలా చేపట్టాలి**

కోతుల బెడద నియంత్రణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపడితే దశలవారీగా సమస్య తీవ్రతను తగ్గించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్, అటవీ, జిల్లా పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు."రైతుల పంటలను కాపాడాలి.. ప్రజలకు కోతుల బెడద నుంచి ఉపశమనం కల్పించాలి. ఇందుకోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలి" అని కలెక్టర్ సూచించారు.కోతుల నియంత్రణలో మెదక్ జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు కృతనిశ్చయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు.ఈ సమీక్షలో జిల్లా అటవీ అధికారి జోజి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## కెమెరా కన్ను.. కాలానికి సాక్ష్యం!



**మొయినాబాద్/ప్రజావాయిస్:**
ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొయినాబాద్ మండలంలోని పీకాక్ ఫోటోగ్రఫీ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు మాట్లాడుతూ.. ఒక్క ఫొటో ఎన్నో జ్ఞాపకాలను పదిలంగా ఉంచుతుందని, కాలం గడిచినా ఆ క్షణాలను కళ్లముందు నిలిపేది ఫోటోగ్రఫీ కళేనని అన్నారు. ఫోటోగ్రఫీ కేవలం చిత్రాన్ని తీయడం మాత్రమే కాదని, వెలుగు--నీడలు, రంగులు, భావోద్వేగాలు, సందర్భాలను కలిపి ఒక కథను చెప్పే కళ అని పేర్కొన్నారు. సాంకేతికత మారుతున్నప్పటికీ మంచి ఫొటోకు సృజనాత్మక దృష్టి, సరైన క్షణాన్ని గుర్తించే నైపుణ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. సమాజంలో జరిగే ముఖ్యమైన సంఘటనలను కెమెరాలో బంధిస్తూ, వాటిని భవిష్యత్ తరాలకు అందించే బాధ్యతను ఫోటోగ్రాఫర్లు నిర్వర్తిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పీకాక్ ఫోటోగ్రఫీ యూనియన్ మండల అధ్యక్షుడు శశిధర్, వాసు, మాణిక్ రెడ్డి, విష్ణు, నరసింహ, శ్రవణ్, మధు, నాగరాజ్, నవీన్, నరేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి పోచమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే నాయిని



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 61వ డివిజన్ ప్రశాంత్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ శ్రీ శ్రీ రాజరాజేశ్వరి పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాజరాజేశ్వరి పోచమ్మ తల్లి అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలని, కరువు కాటకాలు లేకుండా పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## అనమలిస్ ఓటర్లకు నోటీసులు

**ఎన్యుమరేషన్ ఫారాల్లో వ్యత్యాసాలపై విచారణకు ఆదేశాలు**

**94 వేల మందికి నోటీసులు జారీ చేయనున్న అధికారులు**

**నిర్ణీత గడువులో ప్రక్రియ పూర్తి చేయాలి: ముఖ్య ఎన్నికల అధికారి**





**ప్రజా వాయిస్, ఆసిఫాబాద్:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా అనమలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో వ్యత్యాసాలు ఉన్న అనమలిస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి నుంచి సంతకాలు తీసుకోవాలని సూచించారు. నోటీసుల్లో విచారణ జరిగే ప్రదేశం, తేదీని స్పష్టంగా పొందుపరచాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్ల ద్వారా నోటీసులు అందించి, ఓటర్లు సరైన ఆధారాలతో విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ కె. హరిత, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో సుమారు 94 వేల మంది అనమలిస్ ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అనమలిస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## కెమెరా కంటికి డబుల్ ధమాకా

**ప్రపంచ ఫొటోగ్రఫీ డే పోటీల్లో కోదాడ జెమినీ నరేష్ ప్రతిభ**

**చైల్డ్ విభాగంలో సెకండ్ ప్రైజ్..**

**నేచర్‌లో కన్సొలేషన్ అవార్డు**

**ఖమ్మంలో ఘనంగా పురస్కారాల ప్రదానోత్సవం**

**అదనపు డీసీపీ బోజ్జ రామానుజం చేతుల మీదుగా అవార్డులు**







**ప్రజా వాయిస్,కోదాడ:**
కెమెరాతో బంధించిన క్షణాలు.. అవార్డులుగా మారాయి. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌కే హుస్సేన్ ఆధ్వర్యంలో, ఖమ్మం జిల్లా ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో కోదాడకు చెందిన జెమినీ నరేష్ సత్తా చాటారు. రెండు విభాగాల్లో పురస్కారాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. చైల్డ్ విభాగంలో ద్వితీయ బహుమతి, నేచర్ విభాగంలో కన్సొలేషన్ ప్రైజ్ దక్కించుకున్నారు. ఖమ్మంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖమ్మం జిల్లా అదనపు డీసీపీ (పరిపాలన) బోజ్జ రామానుజం చేతుల మీదుగా జెమినీ నరేష్ పురస్కారాలను అందుకున్నారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్, గౌరవ అధ్యక్షుడు నాగరాజు దేవర, హెచ్‌కే హుస్సేన్, కేపీఏఓ ఛైర్మన్ సీఎన్‌సీ శ్రీను, కొకటి నాగేశ్వరరావు, వనమాలి శ్రీనివాసచారి తదితరులు, రెండు రాష్ట్రాలకు చెందిన ఆర్ట్ ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. తనకు రెండు అవార్డులు రావడం పట్ల జెమినీ నరేష్ హర్షం వ్యక్తం చేశారు. తన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హెచ్‌కే హుస్సేన్, ఖమ్మం జిల్లా ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్, నిర్వాహకులు, విశిష్ట అతిథులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలి

**-మోమిన్‌పేట్ సర్కిల్‌లో వార్షిక తనిఖీ**

**నిర్వహించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**సీఐ వెంకట్ పనితీరుకు ఎస్పీ ప్రశంసలు**



**ప్రజా వాయిస్/మోమిన్‌పేట్:**
వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ మోమిన్‌పేట్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో బుధవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ల శాంతిభద్రతలు, నేరాల దర్యాప్తు, పెండింగ్ కేసులు, పోలీస్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు, సీసీ కెమెరాల ఏర్పాటుపై సమీక్షించారు. పోలీస్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ పట్ల సీఐ వెంకట్ పనితీరును ఎస్పీ స్నేహ మెహ్రా ప్రత్యేకంగా అభినందించారు. సర్కిల్ పరిధిలో పోలీసింగ్ సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. తీవ్రమైన నేరాల కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి త్వరగా చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలు, ప్రధాన రహదారులు, ఎంట్రీ--ఎగ్జిట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ అంజయ్య, సీఐ వెంకట్, ఎస్సై లు భరత్ భూషణ్, రాహుఫ్, గిరి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి

**దౌల్తాబాద్‌లో ఘనంగా ముగిసిన SAPL క్రికెట్ టోర్నమెంట్**




**ప్రజ వాయిస్ దౌల్తాబాద్**
యువత క్రీడల్లో తమ ప్రతిభను చాటుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ షేక్ అలీ పిలుపునిచ్చారు. దౌల్తాబాద్ మండలం హైమద్ నగర్ గ్రామంలో గత నాలుగు రోజులుగా అత్యంత ఉత్సాహభరితంగా సాగిన వాక్షేపం క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సస్పెన్స్, ఉత్కంఠభరితంగా సాగిన ఈ వాక్షేపం టోర్నమెంట్ ఫైనల్ పోరులో రైసింగ్ స్టార్స్ జట్టు విజేతగా నిలవగా, రఫీక్ రాయల్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విజేత, రన్నరప్ జట్ల సభ్యులకు సర్పంచ్ షేక్ అలీ బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. క్రీడాకారులు ఓటమి, గెలుపులను సమానంగా స్వీకరించి నిజమైన క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సదర్ సాబ్ జానిమియా, మస్తాన్ పఠాన్, షఫీ, బాబర్, గఫుర్, సోహెల్, ఇర్ఫాన్ తో పాటు పలువురు గ్రామస్తులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులతో భారీ ర్యాలీ






**ప్రజా వాయిస్ హన్మకొండ /పరకాల**
ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పరకాల పాలిటెక్నిక్ కళాశాల నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టిన ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి బొచ్చు ఈశ్వర్ ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. పరకాల పట్టణంలో పాలిటెక్నిక్ 250 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించామని. శక్తి పాలసీ వెనక్కి తీసుకోవాలి వాదీజు బోర్డును అభివృద్ధి చేయాలి హాస్టల్ ల్యాబ్స్ భవనాలు నిధులు ఇచ్చి అభివృద్ధి చేయాలి. పాలిటెక్నిక్ అధ్యాపకులు సిబ్బంది సర్వీస్ నిబంధనకు రక్షణ కల్పించాలి. పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ లో విలీనం చేసే ఉద్దేశం లేదని స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు లేదంటే రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కోకిల సాయి తేజ పట్టణ కార్యదర్శి ఎం డి అఫ్రోజ్ ఎస్ఎఫ్ఐ నాయకులు విక్కీ ప్రశాంత్ రాహుల్ నాగరాజ్ అభినవ్ బన్నీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కారులో 20 బస్తాల సన్నబియ్యం పట్టివేత

**దుర్గాపురం ఎక్స్‌రోడ్డులో పోలీసుల తనిఖీలు.. ఇద్దరిపై కేసు**

**సుమారు 8 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం**

**జగ్గయ్యపేటకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు**



**ప్రజా వాయిస్,అనంతగిరి:**
అక్రమంగా తరలిస్తున్న సన్నబియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం దుర్గాపురం ఎక్స్‌రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో తరలిస్తున్న 20 బస్తాల సన్నబియ్యాన్ని గుర్తించారు. సుమారు 8 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. షేర్ మహమ్మద్‌పేటకు చెందిన పల్లెబోయిన గోపీచంద్ బియ్యాన్ని జగ్గయ్యపేట వైపు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బంజర కాలనీకి చెందిన సత్యనారాయణ వద్ద బియ్యం కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. దీంతో గోపీచంద్, సత్యనారాయణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఎస్సై ఏడుకొండలు తెలిపారు.

## విద్యుత్ షాక్ తో యువకుడు మృతి



**ఆగస్ట్ 19 (ప్రజా వాయిస్ ) చేగుంట**
చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని మాసాయిపేట పట్టణ కేంద్రంలో కరెంట్ షాక్ తగిలి యువకుడు మృతి చెందాడు, చేగుంట పోలీస్ ల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఎడ్ల ప్రవీణ్ (32) బుధవారం తన వ్యవసాయం పొలం వద్ద బుష్ కట్టర్ తో గడ్డి తొలగిస్తుండగా పక్కనే ఉన్న వైర్లు తగిలి విద్యుత్ షాక్ కు గురయ్యాడు, వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించారు, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## సైబర్ నేరాలపై అలర్ట్

**అపరిచిత లింక్లు క్లిక్ చేయకండి**

**మిరుదొడ్డి ఎస్ఐ సతీష్ హెచ్చరిక**



**ప్రజా వాయిస్ మిరుదొడ్డి**
రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు, ముఖ్యంగా యువత అత్యంత అప్రమత్తంగా ఉండాలని మిరుదొడ్డి ఎస్ఐ సతీష్ సూచించారు. ప్రస్తుత రోజుల్లో స్మార్ట్ ఫోన్ వినియోగం విపరీతంగా పెరిగిపోయిందని, దీనినే ఆసరాగా చేసుకుని సైబర్ కేటుగాళ్లు నిత్యం కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్లకు వచ్చే అపరిచిత మెసేజ్లు, లింక్ల పట్ల అవగాహనతో ఉండాలని ఎస్ఐ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి అనుమానాస్పద లింక్లపై క్లిక్ చేయకూడదని, అలా చేయడం వల్ల బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు క్షణాల్లో మాయమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే చాలామంది యువత సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి, తమ కష్టార్జితాన్ని పోగొట్టుకున్నారని గుర్తుచేశారు. ప్రజలను చైతన్యపరిచేందుకు పోలీస్ శాఖ తరఫున ఎప్పటికప్పుడు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒకవేళ ఎవరైనా అజాగ్రత్త వల్ల సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. తక్షణమే ఫిర్యాదు చేస్తే బాధితుల ఖాతాల నుంచి వేరే ఖాతాల్లోకి వెళ్లిన సొమ్మును ఫ్రీజ్ చేసి, నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని ఎస్ఐ సతీష్ వివరించారు.